www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH | TELUGU | HINDI DAILY

## JOURNALISTS WANTED

- Aashwi Updates – Voice of the People
- Telangana & Andhra Pradesh
- District Bureau: Degree mandatory
- Mandal Reporters: Intermediate mandatory
- News writing & reporting skills required
- Interest in public issues preferred
- Honorarium: Based on experience & performance
- Join Aashwi Updates. Be the Voice of the People!

editor@aashwi.in
7207282727 | 72707292727



పోలీసు సిబ్బంది పునర్వ్యవస్థీకరణతో సత్ఫలితాలు 3

శనివారం, 19-09-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :132 Issue : 132 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

# ఫార్ములా ఈ రేసుపై తప్పుడు కేసులు

- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకే రేస్ నిర్వహించాం
- అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ఆరోపణలు
- కేసులకు భయపడేది లేదు.. న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంది
- ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతా: కేటీఆర్
- టార్గెట్ కేసీఆర్‌గానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శ

2



# ఎర్రవల్లి పరిధిలో 388 ఎకరాల్లో సర్వే ముమ్మరం

- నాలుగు బృందాలుగా రంగంలోకి సర్వేయర్లు
- 325 సర్వే నంబర్ లో హద్దుల పరిశీలన
- ఎర్రవల్లి 325 సర్వే నంబర్ భూములపై ఉత్కంఠ

**మర్కుక్, సెప్టెంబర్ 18, ఆశ్వి అప్డేట్స్:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ పరిధిలోని భూములపై రెవెన్యూ అధికారులు సర్వేను ముమ్మరం చేశారు.మర్కుక్ మండలం 325 సర్వే నంబర్ పరిధిలోని 388 ఎకరాల భూమిలో బుధవారం సర్వేయర్లు నాలుగు బృందాలుగా

మిగతా 2వ పేజీలో..



## మిగిలిన ఇళ్లను కూడా కేటాయించండి

- పంట మార్పిడిపై సహకరించాలి
- కేంద్ర మంత్రి చౌహాన్‌కు సీఎం వినతి

2



## 22ఏ భూముల వివాదాల పరిష్కారానికి హైలెవల్ కమిటీ

- ముగ్గురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు
- సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్‌కు చైర్మన్ బాధ్యతలు
- పాపిరెడ్డి, రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా నియామకం
- భూ బాధితుల సమస్యల పరిష్కారానికి విధివిధానాల రూపకల్పన
- కల్వకుంట్ల కుటుంబం భూములపై అసెంబ్లీలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- రేవంత్ కుటుంబ భూముల లెక్కలూ బయటపెడతామన్న కేటీఆర్, హరీశ్‌రావు



**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:** తెలంగాణలో వివాదాస్పదంగా మారిన 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

మిగతా 2వ పేజీలో..

## సమన్వయంతో పనిచేయండి

- ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతం చేయండి
- గేమ్స్ నిర్వహణపై సీఎస్ ఉన్నతస్థాయి సమీక్ష



2

## మిగిలిన 8 మంది ఎమ్మెల్యేల సంగతేంటి?

- దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఫిరాయింపుల కేసుల్లో కొత్త చర్చ
- కాంగ్రెస్‌లో చేరిన ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పిటిషన్లు పెండింగ్
- ప్రతి కేసులోని వాస్తవాలు, ఆధారాలను విడివిడిగా పరిశీలించాల్సిన పరిస్థితి
- దానం తీర్పు నేపథ్యంలో మిగిలిన కేసులపైనా పెరిగిన ఉత్కంఠ
- తదుపరి పరిణామాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి

2

## ఉప ఎన్నిక వచ్చినా సిద్ధమే: దానం నాగేందర్


- హైకోర్టు తీర్పును స్వాగతించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే
- ఉప ఎన్నిక వస్తే పోటీ చేసేందుకు సిద్ధమని వెల్లడి
- ఎన్నికల్లో పోటీ చేయడం తనకు కొత్త కాదని వ్యాఖ్య
- సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన లేదని స్పష్టీకరణ • అనర్హత వేటుపై ఎలాంటి ఆందోళన లేదన్న దానం
- ప్రజల మద్దతు తనకే ఉంటుందని ధీమా

2

## హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్య విజయం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

2





# దానం నాగేందర్‌పై అనర్హత వేటు

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవి నుంచి దానం నాగేందర్ తొలగింపు

- స్పీకర్ ట్రైబ్యునల్ ఉత్తర్వులను కొట్టివేసిన హైకోర్టు
- జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్ ధర్మాసనం తీర్పు
- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ నుంచి లోక్‌సభకు పోటీ
- ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఈసీకి హైకోర్టు సమాచారం
- తీర్పుపై స్టే కోరిన దానం తరపు న్యాయవాదుల అభ్యర్థన తిరస్కరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 18, ఆశ్వి అప్డేట్స్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం.. ఎమ్మెల్యే పదవికి, పార్టీకి రాజీనామా చేయకుండానే 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం శుక్రవారం తీర్పు ఇచ్చింది.

**స్పీకర్ నిర్ణయం తప్పుబాటు**

దానం పార్టీ ఫిరాయింపునకు పాల్పడలేదంటూ స్పీకర్ ట్రైబ్యునల్ మార్చి 11న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కౌశిక్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డిలు హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన ఆధారాలను స్పీకర్‌కు సమర్పించినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోలేదని

మిగతా 2వ పేజీలో..

## ఎల్‌నినో అధిగమించేందుకు ముందస్తు కార్యాచరణ

- తాగునీటికే తొలి ప్రాధాన్యం
- రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తీర్చాం
- వర్షాభావ పరిస్థితులతో వరి సాగు 18% తగ్గుదల
- ప్రత్యామ్నాయ పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం
- 'తెలంగాణ జలసిరి'తో భూగర్భ జలాల పునరుద్ధరణకు చర్యలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

3





## సభను అగౌరవపరిచిన బీఆర్ఎస్

- శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- సమావేశాలకు రాకూడదనే ఉద్దేశంతోనే నిబంధనల ఉల్లంఘన
- స్పీకర్ ను దూషించడం అప్రజాస్వామికం
- మాక్ అసెంబ్లీ దుర్మార్గమైన చర్య
- భూకబ్జాలపై హైపవర్ కమిటీ... నెల రోజుల్లో నివేదిక
- నిరవధికంగా వాయిదా పడిన అసెంబ్లీ

3

## ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలకు షెడ్యూల్

- ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెర.. ఈ నెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ
- అక్టోబర్ 9న పోలింగ్.. 17న ఫలితాల వెల్లడి
- అక్టోబర్ 26న తుది ఓటరు జాబితా విడుదల
- వేతనాలు, డీఏ, బోనస్, ఉద్యోగ భద్రతపై యూనియన్ల ప్రచారం
- చివరిసారిగా 2016 జూలై 19న జరిగిన ఎన్నికలు

2



## ఉప ఎన్నిక వచ్చినా సిద్ధమే: దానం నాగేందర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 18, ఆశ్వి అప్డేట్స్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హైకోర్టు తీర్పుపై తొలిసారిగా స్పందించారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును పూర్తిగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు జరిగితే పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

**ఉప ఎన్నిక వచ్చినా పోరాటం**

ప్రజాక్షేత్రంలో ఎన్నికల్లో పోటీ చేయడం తనకు కొత్తేమీ కాదని దానం నాగేందర్ అన్నారు. రాజకీయ పోరాటాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని విజయం సాధించడం తనకు అలవాటేనని వ్యాఖ్యానించారు. భవిష్యత్‌లో ఎలాంటి పరిణామాలు ఎదురైనా చట్టబద్ధంగా, రాజకీయంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

**సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదు**

హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రస్తుతానికి సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన లేదని దానం నాగేందర్ స్పష్టం చేశారు. తనపై అనర్హత వేటు పడే అవకాశం ఉన్నప్పటికీ తాను ఆందోళన చెందడం లేదన్నారు. నియోజకవర్గ ప్రజల మద్దతు తనకు ఎప్పుడూ ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

---

## హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్య విజయం

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 , ఆశ్వి అప్డేట్స్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పును బీజేపీ స్వాగతిస్తోందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించడమే కాక ఒక పార్టీపై గెలిచి మరో పార్టీ తరఫున నామినేషన్ వేసిన నాటినుంచే ఆ అనర్హత వర్తిస్తుందని పేర్కొనడం, స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టడం అత్యంత కీలక పరిణామమని పేర్కొన్నారు. ఈ విజయం నైతికంగా, చట్టపరంగా రాజ్యాంగానికి లభించిన తిరుగులేని గెలుపని కొనియాడారు. చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని నీతులు చెప్పే రాహుల్ గాంధీ తన తండ్రి రాజీవ్ గాంధీ తెచ్చిన 10వ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) మార్గదర్శకాలను స్వయంగా విస్మరించడం హాస్యాస్పదమని విమర్శించారు. గతంలో బీఆరఎస్ ప్రభుత్వం ఏ విధంగానైతే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందో నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో వెళ్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు తాజా తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ అనైతిక విధానాలకు చెంపపెట్టు అని, నైతికంగా, చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా ఓడిపోయిందని స్పష్టం చేశారు. అంతేకాక స్పీకర్ నిర్ణయం తప్పని న్యాయస్థానంలో తేలిపోయిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై నిజమైన గౌరవం ఉంటే ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలందరూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. వారు ఏ పార్టీలో చేరారో అదే పార్టీ గుర్తుపై మళ్లీ పోటీ చేసి ప్రజాక్షేత్రంలో ప్రజాతీర్పును పొంది గెలవడమే నిజమైన రాజ్యాంగ స్ఫూర్తి అని తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడే దిశగా వెలువడిన ఈ తీర్పు ప్రజాస్వామ్యానికే గర్వకారణమని ఆయన పునరుద్ఘాటించారు.

---

## ఎర్రవల్లి పరిధిలో 388 ఎకరాల్లో సర్వే ముమ్మరం

**మొదటిపేజీ తరువాయి**

జిల్లా సర్వేయర్ అనిల్, శంకర్, డివిజన్ సర్వేయర్ వంశీ, మండల సర్వేయర్ ప్రజ్వల సర్వే చేపట్టారు. ఫీల్డ్ లో సర్వే చేస్తుండగా మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో మరికొందరు సర్వేయర్లు ఉంటూ ఫీల్డ్ లో ఉన్న బృందాలకు ఎప్పటికప్పుడు గైడెన్స్ ఇస్తూ సమాచారం సేకరించారు.ఈ సర్వేలో ప్రభుత్వ ఉన్నతాధికారులు నేరుగా పాల్గొనలేదు.325 సర్వే నంబర్ లో మొత్తం 388ఎకరాల భూమి ఉంది.ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులు మాట్లాడుతూ 325 సర్వే నంబర్ లో కేసీఆర్ పేరు మీద గానీ, ఆయన కబ్జా చేసింది గానీ ఇంచు కూడా లేదు అని,అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడింది తప్పు అని చెప్పారు. మరికొందరు రైతులు 325 సర్వే నంబర్ పరిధిలో దాదాపు 80 నుండి 90 ఎకరాల్లో చెరువు తవ్వించి దానికి పాండురంగ డ్యాం అని నామకరణం చేశారని, ఆ చెరువు కింద భూములు కోల్పోయిన తమకు ఇంకోచోట భూమి ఇప్పిస్తానని చెప్పి ఇప్పటివరకు ఇప్పించలేదని ఆరోపించారు. 325 సర్వే నంబర్ లోని లావణి పట్టా భూములు 388 ఎకరాలను తమ పేరు మీద శాశ్వతంగా పట్టా చేయాలని, తమ ఆధీనంలో ఉన్న భూముల జోలికి రావద్దని రైతులు సర్వే బృందాలకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు సేవ్య నాయక్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ 325 సర్వే నంబర్ లో ప్రభుత్వ భూమి పూర్తి విస్తీర్ణం 388.5 గుంటల భూమి ఇది మూడు గ్రామాల శివారులను శివార్ వెంకటాపూర్,వరదరాజపూర్ ఎర్రవల్లి ఆనుకొని ఉన్నదని,ఎర్రవల్లి భూమిని సర్వే చేయమని అధికారులు ఆదేశించారని తెలిపారు. ఈ సందర్భంగా సర్వే బృందాలు ఇక్కడికి చేరుకొని నాలుగు బృందాలుగా ఏర్పడి డిజిపిఎస్ రోవర్తో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రి సర్వే చేయమని చెప్పడంతో డీజిపిఎస్ టెక్నాలజీతోనే నిర్వహిస్తున్నామని, ప్రతిది క్షుణ్ణంగా శాటిలైట్ ద్వారా పాయింట్లు తీసుకోవడం జరిగింది. దీని పూర్తి మ్యాపు తయారు చేసిన తర్వాత దీంట్లో వచ్చిన చెరువు,కెనాల్ సాగుకు ఉపయోగపడని భూమి, ఉపయోగపడే భూమి ఎంత ఉన్నది అనేది దాని మీద పూర్తి సమాచారం కొరకు ఈ సర్వే నిర్వహిస్తున్నాం అని,రైతులు ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా సర్వేకు సహకరిస్తున్నారని తెలిపారు.

---

## సమన్వయంతో పనిచేయండి

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 , ఆశ్వి అప్డేట్స్:** రాష్ట్రంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. డిసెంబర్ 11 నుండి 22వ తేదీ వరకు జరిగే ఖేలో ఇండియా యువజన క్రీడల ఏర్పాట్లపై సచివాలయంలో శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ హైదరాబాద్‌తోపాటు హన్మకొండ, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్ నగర్, ఖమ్మం జిల్లాల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న క్రీడాకారులు పాల్గొనే ఈ క్రీడా పోటీలు దేశంలో జాతీయ క్రీడల అనంతరం అంతే ప్రాధాన్యత ఉన్న పోటీలని, మొత్తం 27 ఈవెంట్స్‌లో దాదాపు 6,050 మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. వీటిలో 14 వ్యక్తిగత క్రీడా విభాగాలు, 6 విభాగాలు టీమ్ ఈవెంట్లు, మరో ఆరు ఇతర క్రీడా ఈవెంట్లు ఉంటాయన్నారు. ఈ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చైర్మన్‌గా, క్రీడా శాఖ మంత్రి కోచైర్మన్‌గా మొత్తం 18 మందితోకూడిన ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. దీంతోపాటు 28 మంది ఉన్నతాధికారులతో కూడిన ఎగ్జిక్యూటివ్ కమిటీ, మరో 18 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని సంజయ్ జాజు వెల్లడించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, స్పోర్ట్స్ కార్పొరేషన్ ఎండీ సోని బాలాదేవి, కళాశాల, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఐటి శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, రైతు డిస్కమ్ ఎండీ ముషారఫ్ అలీ, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

---

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు

**మొదటిపేజీ తరువాయి**

వారు వాదించారు. ఈ పిటిషన్లపై విచారణ అనంతరం స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఆగస్టు 21న తీర్పును రిజర్వ్ చేసిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌ల ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.

ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఎన్నికల సంఘానికి హైకోర్టు సమాచారం ఇచ్చింది. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో ఈ వ్యవహారం కీలక పరిణామంగా మారింది.

**స్టేకు హైకోర్టు నిరాకరణ**

తీర్పు అమలుపై స్టే విధించి, సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు సమయం ఇవ్వాలని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు కోరారు. ఎమ్మెల్యేను వెంటనే పదవి నుంచి తొలగిస్తే నియోజకవర్గ ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కోర్టుకు తెలిపారు. అయితే ఈ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది.

**తీర్పును స్వాగతించిన బీజేపీ**

దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పును బీజేపీ స్వాగతించింది. ఒక పార్టీ తరఫున గెలిచి మరో పార్టీలో కొనసాగడాన్ని ప్రశ్నిస్తూ తాము న్యాయపోరాటం చేశామని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేయడం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పరిణామమన్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజల తీర్పు కోరాలని కాంగ్రెస్‌ను ఆయన డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లకుండా దాన్ని గౌరవించి వెంటనే రాజీనామా చేయాలని కోరారు. ప్రతివాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించకుండా ఉండేందుకు బీజేపీ తరఫున కేవియట్ దాఖలు చేయనున్నట్లు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

---

# మిగిలిన 8 మంది ఎమ్మెల్యేల సంగతేంటి?

**హైదరాబాద్, సెప్టెంబర్ 18, ఆశ్వి అప్డేట్స్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అయితే దానం కేసుతో పాటు కాంగ్రెస్‌లో చేరిన ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపైనా ఇప్పుడు చర్చ మొదలైంది.

**దానం కేసు ప్రభావం ఎంత?**

మిగిలిన ఎనిమిది మంది ఎమ్మెల్యేల విషయంలోనూ దానం నాగేందర్‌కు వచ్చిన తీర్పే పునరావృతమవుతుందని ఇప్పుడే నిర్ధారించలేం. ఆయా కేసుల్లోని వాస్తవాలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, పిటిషన్లలో చేసిన అభ్యర్థనలు, సంబంధిత ఎమ్మెల్యేల చర్యలను న్యాయస్థానం విడివిడిగా పరిశీలించాల్సి ఉంటుంది. అయితే దానం కేసులో హైకోర్టు తీర్పు రావడం వల్ల ఇతర ఫిరాయింపు కేసుల్లోనూ న్యాయపరమైన వాదనలకు కొత్త ప్రాధాన్యం ఏర్పడింది. దీంతో పెండింగ్‌లో ఉన్న పిటిషన్ల తదుపరి విచారణలు, వాటిపై న్యాయస్థానం తీసుకునే నిర్ణయాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది.

**బీఆర్ఎస్ వాదన ఇదే**

దానం నాగేందర్‌పై వచ్చిన తీర్పు మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులపైనా ప్రభావం చూపుతుందని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. దీంతో కాంగ్రెస్‌లో చేరిన ఆ ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్ల పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కీలక చర్చగా మారింది.

---

## ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలకు షెడ్యూల్

- **ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెర.. ఈ నెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ**
- **అక్టోబర్ 9న పోలింగ్.. 17న ఫలితాల వెల్లడి**
- **అక్టోబర్ 26న తుది ఓటరు జాబితా విడుదల**
- **దాదాపు 48 వేల మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు అంచనా**
- **వేతనాలు, డీఏ, బోనస్, ఉద్యోగ భద్రతపై యూనియన్ల ప్రచారం**
- **చివరిసారిగా 2016 జూలై 19న జరిగిన ఎన్నికలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18, ఆశ్వి అప్డేట్స్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు షెడ్యూల్ ఖరారైంది. ఎనిమిదేళ్లుగా ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న కార్మికులకు మార్గం సుగమమైంది. కార్మిక శాఖ జాయింట్ డైరెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఈ నెల 21 నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబర్ 9న పోలింగ్ నిర్వహించనుండగా, అక్టోబర్ 17న ఫలితాలు ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. అక్టోబర్ 26న అన్ని జిల్లాల్లో తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.

**గుర్తింపు సంఘాలకు కీలక హక్కులు**

ఆర్టీసీలో పలు కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించిన సంఘాలకే గుర్తింపు లభిస్తుంది. రీజియన్, రాష్ట్ర స్థాయిల్లో ఈ సంఘాలు కార్మికుల తరఫున వ్యవహరిస్తాయి. రెండు స్థాయిల ఎన్నికలకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తారు. వేతనాలు, బోనస్, కరవు భత్యం (డీఏ), సర్వీస్ నిబంధనలు తదితర అంశాలపై యాజమాన్యం, ప్రభుత్వంతో చర్చలు జరిపే చట్టపరమైన హక్కు గుర్తింపు సంఘాలకు ఉంటుంది. కార్మికుల తరఫున ఒప్పందాలు కుదుర్చుకోవడంలోనూ ఇవే కీలకంగా వ్యవహరిస్తాయి. రీజియన్‌లోని అధికారి స్థాయి ఉద్యోగులను మినహాయించి మిగిలిన ఉద్యోగులు, కార్మికులందరికీ ఓటు హక్కు ఉంటుంది.

**ప్రధాన అజెండాగా కార్మిక సమస్యలు**

వాస్తవానికి గుర్తింపు సంఘం ఎన్నికలు 2018లోనే జరగాల్సి ఉన్నా అప్పట్లో నిర్వహించలేదు. ఈసారి దాదాపు 48 వేల మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే పలు కార్మిక సంఘాలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. వేతన సవరణ, ఉద్యోగ భద్రత, కార్మికుల సమస్యల పరిష్కారం తదితర అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కార్మిక శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

---

## మిగిలిన ఇళ్లను కూడా కేటాయించండి

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్ :** పీఎంఏవై జీ పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రానికి రెండు లక్షల ఇండ్లను కేటాయించినందుకు కేంద్ర వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కోరారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఆయనను మాదాపూర్‌లో శుక్రవారం సీఎం కలిశారు. 1,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని గత జూలైలో కేంద్ర మంత్రికి ఢిల్లీలో ముఖ్యమంత్రి వినతి పత్రం అందించారు. ప్రస్తుతం రెండు లక్షల ఇళ్లే కేటాయించినందున మిగిలిన ఇండ్లను కూడా కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై కేంద్ర మంత్రికి వివరిస్తూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయంలో విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. వ్యవసాయ రంగంలో ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని అందిస్తున్నామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ అందించి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని సీఎం వివరించారు. 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్స్, వెజిటబుల్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పంట మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

---

## ఫార్ములా ఈ రేసుపై తప్పుడు కేసులు

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:** ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహణలో ఎలాంటి అవినీతి జరగలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో పెంచాలనే ఉద్దేశంతోనే రేస్ నిర్వహించామని తెలిపారు. ఈ వ్యవహారంలో తనపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. ఫార్ములా ఈ రేస్ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు.

**న్యాయవ్యవస్థపై నమ్మకం**

కేసులకు తాము భయపడబోమని, న్యాయవ్యవస్థపై తమకు అపారమైన నమ్మకం ఉందని కేటీఆర్ అన్నారు. పోలీసులు ఎంత వేధించినా ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయవ్యవస్థ తమకు అండగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ రేస్ కేసులో ఎప్పుడు విచారణకు పిలిచినా హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

**లక్ష కోట్ల ఆరోపణలపై సవాల్**

పక్క రాష్ట్రాలు తమ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుకునేందుకు అంతర్జాతీయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని కేటీఆర్ అన్నారు. తమిళనాడు సీఎం విజయ్ ఫార్ములా ఈ రేస్ కోసం లండన్ వెళ్లారని పేర్కొన్నారు. ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్న ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మాత్రం తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా కేసీఆర్‌ను పెట్టుకుని పనిచేస్తోందని ఆరోపించారు. తమపై లక్ష కోట్లు సంపాదించారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. తమ పేరుతో లక్ష కోట్ల ఆస్తులు ఉంటే రూ.1,000 కోట్లు తీసుకుని, మిగిలిన రూ.99 వేల కోట్లను రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల కోసం ఖర్చు చేయాలని రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. కాళేశ్వరం విషయంలో లక్ష కోట్లంటూ ప్రచారం చేసినట్టే ఇప్పుడు కూడా తమపై విషప్రచారం చేస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

---

## నిరంకుశ నిజాం ఆదర్శమా?

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 ఆశ్వి అప్డేట్స్:** అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు, బీఆర్ఎస్‌కాంగ్రెస్ నేతలు పరస్పరం చేసుకుంటున్న ఆరోపణలు చూస్తుంటే ఆ రెండు పార్టీల అసలు నైజం ఏమిటో ప్రజలు స్పష్టంగా గమనించాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేసీఆర్ పదేపదే నిజాంను మంచి పరిపాలకుడని, గొప్ప పనులు చేశాడని కీర్తిస్తే మొన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సైతం నిజాం చాలా గొప్ప మనిషంటూ పొగడ్తలతో ముంచెత్తడం ఈ రెండు పార్టీల వక్ర వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. నాడు నిజాం పాలనలో పల్లెల్లో కనీసం ఆడబిడ్డలు బతుకమ్మను కూడా ఆడుకోలేని పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. జలియన్ వాలాబాగ్ తరహాలో పరకాల, జోడేఘాట్, గుండ్రాంపల్లి, వెయ్యి ఊడల మర్రి (నిర్మల్) వంటి అనేక ప్రాంతాల్లో ప్రజలను విచక్షణా రహితంగా కాల్చి చంపిన రక్త చరిత్ర నిజాం సర్కారుదని అన్నారు. అలాంటి క్రూరమైన నిజాంను నేడు ప్రజాస్వామ్య పాలనలో ఇద్దరు ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకుంటున్నారంటే అంతకంటే దారుణం మరొకటి ఉండదని మండిపడ్డారు.

---

# 22ఏ భూముల వివాదాల పరిష్కారానికి హైలెవల్ కమిటీ

**మొదటిపేజీ తరువాయి**

శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ముగ్గురు సీనియర్ అధికారులతో కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిషేధిత జాబితాలో చేరిన భూములకు సంబంధించిన వివాదాలను పరిశీలించి, బాధితులకు పరిష్కారం చూపే విధంగా కమిటీ విధివిధానాలను రూపొందించనుంది.

**ముగ్గురు అధికారులతో కమిటీ**

సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. పాపిరెడ్డి, రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22ఏ జాబితాలో పొరపాటుగా చేరిన ప్రైవేట్ భూములు, నిషేధిత భూములకు సంబంధించిన ఇతర వివాదాలను పరిశీలించి తగిన పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది.

**భూముల వివరాలపై సీఎం ఆరోపణలు**

రాష్ట్రంలో అటవీ, అసైన్డ్, దేవాదాయ శాఖలకు చెందిన 1.02 కోట్ల ఎకరాలు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీలో పేర్కొన్నారు. వీటిని తొలగించే అధికారం మంత్రులకు కూడా లేదని స్పష్టం చేశారు. నిజాం కాలం నుంచి కొనసాగుతున్న భూ సమస్యలపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా 2.50 కోట్ల ఎకరాల భూముల వివరాలు విదేశీ మాఫియా చేతుల్లోకి వెళ్లాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయడం, అధికారుల పొరపాట్లతో ప్రైవేట్ భూములు 22ఏ జాబితాలో చేరడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు.

**కల్వకుంట్ల కుటుంబ భూములపైనా వ్యాఖ్యలు**

22ఏ జాబితాలో 12 అంశాలను గుర్తించామని, సభ్యుల సూచనల ఆధారంగా పేదలకు న్యాయం చేస్తామని సీఎం తెలిపారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులు నష్టపోతే కేసీఆర్ కుటుంబం మాత్రం వేల కోట్లు, వందల ఎకరాల ఆస్తులు సంపాదించిందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కల్వకుంట్ల కుటుంబం, వారి బంధువుల పేరిట తొమ్మిది జిల్లాల్లో ఉన్న 439.30 ఎకరాల భూముల వివరాలను సర్వే నంబర్లతో సహా అసెంబ్లీలో వెల్లడించారు. ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల్లో ప్రభుత్వ భూములతో పాటు రైతుల నుంచి తీసుకున్న భూములు ఉన్నాయనే ఆరోపణలపై 30 రోజుల్లో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సిద్దిపేట కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు.

దీనిపై కేటీఆర్, హరీశ్‌రావు స్పందిస్తూ రేవంత్‌రెడ్డి కుటుంబం పేరిట కూడా వందల ఎకరాల భూములు ఉన్నాయని ఆరోపించారు. వాటికి సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రజల ముందుంచుతామని వారు ప్రకటించారు.

# సభను అగౌరవపరిచిన బీఆర్ఎస్

- శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- సమావేశాలకు రాకూడదనే ఉద్దేశంతోనే నిబంధనల ఉల్లంఘన
- స్పీకర్ ను దూషించడం అప్రజాస్వామికం
- మాక్ అసెంబ్లీ దుర్మార్గమైన చర్య
- భూకబ్జాలపై హైపవర్ కమిటీ... నెల రోజుల్లో నివేదిక
- నిరవధికంగా వాయిదా పడిన అసెంబ్లీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 18, ఆశ్వి అప్డేట్స్:**

శాసనసభ సమావేశాలకు హాజరయ్యే ఉద్దేశం లేకనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉద్దేశపూర్వకంగా సభా నియమాలను ఉల్లంఘించారని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. సభ సజావుగా సాగకూడదన్న కుట్రతోనే వారు ఆటంకాలు సృష్టించారని విమర్శించారు. ఎనిమిది రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాలు శుక్రవారంనిరవధికంగా వాయిదా పడిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. టీ షర్టులపై స్లోగన్స్ రాసుకుని రావడం నిబంధనలకు విరుద్ధమని తెలిసీ కేవలం ప్రచారం కోసం బీఆర్ఎస్ నేతలు సభా సంప్రదాయాలను తుంగలో తొక్కారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వారి ప్రభుత్వ హయాంలోనే ప్లకార్డులు, స్లోగన్స్‌తో సభలోకి రాకూడదని అప్పటి స్పీకర్ రూలింగ్ ఇచ్చారని, కొత్త రూల్స్ తెచ్చారని గుర్తుచేశారు. ఆ విషయం తెలిసి కూడా సభా మర్యాదను మంటగలిపారని దుయ్యబట్టారు. శాసనసభ జరుగుతుండగానే బయట మాక్ అసెంబ్లీ నిర్వహించడం సభ గౌరవాన్ని అవహేళన చేయడమేనని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని మంత్రి అన్నారు. నెల రోజులు సభ నిర్వహించాలని కేటీఆర్ కోరడం ఉత్త మాటలే అని తేలిపోయిందన్నారు. ఎంతో అనుభవం ఉన్న నాయకులు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి ఆందోళన చేయడం కరెక్ట్ కాదన్నారు. స్పీకర్‌ను దూషించడం అప్రజాస్వామికమని, ఈ ఘటన యావత్ తెలంగాణ సమాజం చూసిందని, ఇది స్పీకర్‌ను తీవ్ర మనస్తాపానికి గురిచేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**భూకబ్జాలపై హైపవర్ కమిటీ**

భూముల ఆక్రమణల వ్యవహారంపై విచారణ జరిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైపవర్ అధికారులతో కూడిన ఓ కమిటీని వేశారని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ కమిటీ నెల రోజుల వ్యవధిలో 12 కీలక అంశాలపై దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుందని, ఆ నివేదిక ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

**విజయవంతంగా ముగిసిన సమావేశాలు**

ఈ నెల 7న ప్రారంభమైన శాసనసభ సమావేశాలు 18వ తేదీ వరకు విజయవంతంగా జరిగాయని, ప్రజా సంక్షేమ పథకాలకు సంబంధించిన అనేక అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగిందని మంత్రి తెలిపారు. సభలో ప్రతి ఒక్కరికీ మాట్లాడే అవకాశం కల్పించామన్నారు. మొత్తం పని దినాలు: 8 రోజులు, సభ జరిగిన సమయం: 51 గంటల 52 నిమిషాలు మౌఖిక సమాధానాలు (మంత్రుల ద్వారా): 50. సమాధానం ఇచ్చిన స్టార్డ్ ప్రశ్నలు: 9 సమాధానం ఇచ్చిన అన్‌స్టార్డ్ ప్రశ్నలు: 1 సభ్యులు అడిగిన సప్లిమెంటరీ ప్రశ్నలు: 86 సభ్యుల ప్రసంగాలు: 105, మంత్రులు చేసిన ప్రకటనలు: 2, ఆమోదం పొందిన ప్రభుత్వ తీర్మానాలు: 3, సభలో ఆమోదం పొందిన బిల్లులు: 4, స్వల్పకాలిక చర్చలు: 4 సమాధానాలు అందని ప్రశ్నలు: స్టార్డ్ - 62, అన్‌స్టార్డ్ - 22 అని మంత్రి తెలిపారు

# మిల్లర్ల సమస్యలకు సానుకూల పరిష్కారం

- మంత్రివర్గ ఉప సంఘంతో రైస్ మిల్లర్ల ప్రతినిధుల భేటీ
- రైతుల ప్రయోజనాలు-ప్రజాధన పరిరక్షణతో మిల్లింగ్ రంగానికి భరోసా
- మిల్లర్లను ప్రత్యర్థులుగా కాదు.. భాగస్వాములుగా చూస్తాం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 18, ఆశ్వి అప్డేట్స్ :**

రైస్ మిల్లర్లు సమ్మెకు దిగిన నేపథ్యంలో నెలకొన్న పరిస్థితికి సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. అసెంబ్లీ ప్రాంగణంలో మంత్రివర్గ ఉప సంఘం, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల మధ్య శుక్రవారం జరిగిన సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. పరస్పర విశ్వాసం, సహృద్భావ వాతావరణంలో జరిగిన ఈ చర్చల్లో మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సావధానంగా విని నిబంధనల పరిధిలో సానుకూల పరిష్కారం చూపేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. నీటిపారుదల, పౌర సరఫరాల శాUల మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పరిశ్రమలుఐటీ శాU మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్, అదనపు డైరెక్టర్ రోహిత్ పాల్గొన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున తూడి దేవేందర్ రెడ్డి, గంప నాగేందర్, మోహన్ రెడ్డి, గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెనాల్టీలు, టెండర్ ధాన్యం ధరలు, స్టాక్ వ్యత్యాసాలు, సరఫరా గడువు పొడిగింపు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇతర ఇబ్బందులను మిల్లర్ల ప్రతినిధులు మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకొచ్చారు. వారి అభ్యంతరాలు, ఆందోళనలను మంత్రులు ఓపికగా విని అంశాలవారీగా అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మిల్లర్లను ప్రభుత్వం ప్రత్యర్థులుగా కాక ధాన్యం కొనుగోలుమిల్లింగ్ వ్యవస్థలో కీలక భాగస్వాములుగా చూస్తోందని స్పష్టం చేశారు. ఈ అంశానికి రాజకీయాలతో సంబంధం లేదని, రైతులు, ప్రభుత్వం, మిల్లర్లు ఒకే వ్యవస్థలో భాగస్వాములనే భావనతో సమస్యను పరిష్కరించాలని సూచించారు. మిల్లర్ల వినతులను సానుకూల దృక్పథంతో పరిశీలిస్తాం.. ప్రభుత్వ పరిధిలో ఏమి చేయగలమో అన్ని కోణాల్లో ఆలోచిస్తాం.. మిల్లర్లపై అనవసరమైన భారం మోపాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదు.. అదే సమయంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చేసిన వాస్తవ వ్యయాన్ని, ప్రజాధనాన్ని విస్మరించలేం అని మంత్రి పేర్కొన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు పౌర సరఫరాల సంస్థ బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుంటోందని, ఆ నిధులతో రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగిస్తున్నామని వివరించారు. రైతులకు చెల్లించిన కనీస మద్దతు ధరతో పాటు బ్యాంకులకు చెల్లిస్తున్న వడ్డీని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. టెండర్ ధాన్యం ధర రెండు నెలల క్రితం నిర్ణయించినది కావచ్చు.. కానీ ఆ తర్వాత కూడా పౌర సరఫరాల సంస్థ బ్యాంకులకు నిరంతరంగా వడ్డీ చెల్లిస్తూనే ఉంది.. రైతులకు చెల్లించిన మద్దతు ధర, దానిపై ప్రభుత్వం భరించిన వడ్డీ కంటే తక్కువ ధరను నిర్ణయించడం సాధ్యం కాదు.. ప్రభుత్వం ఖర్చు చేసిన వాస్తవ మొత్తాన్ని తిరిగి రాబట్టుకోవడమే తమ ఉద్దేశం.. అంతకు మించి మిల్లర్లపై భారం వేయాలన్న ఆలోచన లేదు అని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం మిల్లర్లు ప్రస్తావిస్తున్న పెనాల్టీలను గత ప్రభుత్వం విధించిందని మంత్రి గుర్తు చేశారు. అయితే అవి గత ప్రభుత్వ నిర్ణయాలంటూ సమస్యను పక్కన పెట్టబోమని, మిల్లర్ల ప్రస్తుత ఇబ్బందులను సానుకూల దృక్పథంతో పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు. ఏడాది, రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరఫరాల కారణంగా పౌర సరఫరాల సంస్థపై వడ్డీ భారం పెరిగిన విషయాన్ని కూడా మిల్లర్లు అర్థం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వానికి, మిల్లర్లకు మధ్య ఎవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవని, రైతుల సంక్షేమం, ప్రజాధన పరిరక్షణ, మిల్లింగ్ రంగం స్థిరత్వం అనే మూడు లక్ష్యాల మధ్య సమతుల



పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారంపై ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ముందుకొస్తున్నందున మిల్లర్లు సమ్మెను విరమించి నాలుగైదు రోజుల సమయం ఇవ్వాలని మంత్రి కోరారు. ఈ వ్యవధిలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో అధికారులు మిల్లర్ల వినతులను, ప్రభుత్వ వాస్తవ వ్యయాన్ని, నిబంధనల పరిధిలో అందుబాటులో ఉన్న పరిష్కార మార్గాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. అధికారుల స్థాయిలో ప్రాథమిక కసరత్తు పూర్తయిన తరువాత మిల్లర్ల ప్రతినిధులతో మరోసారి సమావేశమై తుది నిర్ణయానికి రావాలని సమావేశంలో నిర్ణయించారు. సమస్యను సాగదీయకుండా, ఏకపక్ష నిర్ణయాలకు తావివ్వకుండా, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సాధించాలన్న సంకల్పాన్ని ప్రభుత్వం వ్యక్తం చేసింది.

# ఎల్‌నినో అధిగమించేందుకు ముందస్తు కార్యాచరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 , ఆశ్వి అప్డేట్స్:**

పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షపాతం లోటు, జలాశయాల్లో నీటి ప్రవాహం తగ్గడం, విద్యుత్ డిమాండ్ పెరగడం వంటి సవాళ్లు ఎదురయ్యాయని, అయితే ప్రభుత్వం ఏప్రిల్ నుంచే ముందస్తు చర్యలు చేపట్టి పరిస్థితులను విజయవంతంగా నియంత్రిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో స్పష్టం చేశారు. సమస్య తలెత్తిన తర్వాత స్పందించడం కాకుండా, నష్టం జరగక ముందే అప్రమత్తమై వివిధ శాఖల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లోనే కాక, ఆగస్టులో ఏకంగా 38 శాతం వర్షపాతం లోటు నమోదైందని డిప్యూటీ సీఎం తెలిపారు. వర్షాభావ పరిస్థితుల వల్ల వానాకాలం సాగు విస్తీర్ణం గత ఏడాది 139.29 లక్షల ఎకరాల నుంచి ఈ ఏడాది 123.74 లక్షల ఎకరాలకు తగ్గింది. వరి సాగు సుమారు 18 శాతం తగ్గింది. తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, పంటల వైవిధ్యీకరణపై 1,600 గ్రామాల్లో 2 లక్షలకు పైగా రైతులకు అవగాహన కల్పించాం. 32 జిల్లాలకు ప్రత్యేక ఎల్‌నినో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాం. నిపుణుల సలహాలతో 27 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి అధికారులను, రైతులను నిరంతరం అప్రమత్తం చేస్తున్నాం.

**రాబోయే 12 నెలలకు తాగునీటి భద్రతే లక్ష్యంగా..**

రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల మొత్తం సామర్థ్యం 808 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 465 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. రాబోయే 11-12 నెలల తాగునీటి అవసరాలకు నీటిని కేటాయించిన తర్వాతే ఇతర అవసరాలకు వినియోగిస్తాం. కల్వకుర్తి, నెట్టెంపాడు, దేవాదుల, కోయిల్ సాగర్, భీమా తదితర ఎత్తిపోతల పథకాల ద్వారా చెరువులు, రిజర్వాయర్లను నింపుతున్నాం. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, హైదరాబాద్ సహా చుట్టుపక్కల ప్రాంతాలకు మిషన్ భగీరథ, కృష్ణా, గోదావరి వనరుల నుంచి ప్రత్యామ్నాయంగా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేశాం.

**'తెలంగాణ జలసిరి'**

పడే ప్రతి వర్షపు చుక్కను నిల్వ చేసేందుకు 24 లక్షల ఇంకుడు గుంతలు, 50 వేల వ్యవసాయ కుంటలు, 12 వేల పర్కొలేషన్ ట్యాంకులు, 12 వేల బోరు బావుల రీచార్జ్ నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించాం.

**చరిత్రలో రికార్డు విద్యుత్ డిమాండ్**

వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వ్యవసాయ బోరు బావుల వాడకం పెరగడం, ఎత్తిపోతల పథకాల లోడ్ భారీగా పెరగడం వల్ల విద్యుత్ డిమాండ్ తీవ్రస్థాయికి చేరిందని తెలిపారు. సెప్టెంబర్ 9న ఉదయం 10.41 గంటలకు రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 19,543 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే దాదాపు 4,000 మెగావాట్ల అదనపు భారం పడింది. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గిపోయినప్పటికీ, థర్మల్ కేంద్రాల ఉత్పత్తి పెంచడం, సింగరేణి బొగ్గు కేటాయింపులను సమర్థంగా వాడుకోవడం, మార్కెట్ కొనుగోళ్ల ద్వారా విద్యుత్‌ను సమీకరించి రైతులకు, గృహాలకు, పరిశ్రమలకు ఎలాంటి అంతరాయం లేని సరఫరాను అందించాం.

**గ్రామీణ ఉపాధి – ప్రజారోగ్యంపై నిఘా**

వర్షాభావ సమయంలో గ్రామీణ జీవనోపాధులను కాపాడేందుకు 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 7.3 కోట్ల పని దినాలను సృష్టించి, ₹2,100.53 కోట్ల వేతనాలను నేరుగా కూలీల ఖాతాల్లో జమ చేశాం. ఎల్‌నినో వల్ల పెరిగే ఉష్ణోగ్రతల దృష్టియా వేడిగాలుల హెచ్చరికలు జారీ చేయడం, తాగునీటి ఏర్పాట్లు, కూలింగ్ కేంద్రాలు, అంగన్‌వాడీల ద్వారా పోషకాహార పంపిణీకి చర్యలు తీసుకున్నాం. ఈ ఏడాది 6.18 కోట్ల మొక్కల లక్ష్యానికి గాను ఇప్పటికే 5.91 కోట్ల మొక్కల నాటే ప్రక్రియను, పంపిణీని పూర్తి చేశాం. ప్రకృతి విపత్తులను ఆపడం సాధ్యం కాకపోయినా, ప్రభుత్వ ముందస్తు చర్యలు, వివిధ శాఖల సమన్వయం



తో ప్రజలను, రైతాంగాన్ని ఆదుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

**లోటు వర్షపాతం.. అడుగంటిన జలాశయాలు**

2026 నైరుతి రుతుపవనాల కాలంలో ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం ఏర్పడింది. జూన్ 1 నుండి సెప్టెంబర్ 16 వరకు సాధారణ వర్షపాతం 664.5 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా, కేవలం 536.5 మి.మీ. మాత్రమే నమోదై 20 శాతం లోటు ఏర్పడింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 19 జిల్లాలు తీవ్ర వర్షాభావ కేటగిరీలో ఉన్నాయి. వర్షభావం వల్ల పంటల సాగు విస్తీర్ణం తీవ్రంగా పడిపోయింది. సాధారణ సాగు విస్తీర్ణం 139.29 లక్షల ఎకరాలు కాగా, కేవలం 88 శాతం విస్తీర్ణంలోనే సాగైంది. ముఖ్యంగా వరి సాగు విస్తీర్ణం 18 శాతం తగ్గింది. సరిపడా నీరు లేక విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులు పలుమార్లు విత్తనాలు వేయాల్సి వచ్చి పెట్టుబడి భారం రెట్టింపైంది. మరోవైపు రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల మొత్తం సామర్థ్యం 585 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 241 టీఎంసీల లైవ్ స్టోరేజ్ మాత్రమే అందుబాటులో ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 497 టీఎంసీల నీటి నిల్వలు ఉండడం గమనార్హం. ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే రిజర్వు చేయాల్సి రావడంతో రాబోయే యాసంగి పంటలకు సాగునీటి కొరతతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశముందని సభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

**కేంద్రానికి శాసనసభ కోరిన ప్రధాన డిమాండ్లు:**

క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయడానికి కేంద్ర బృందాన్ని వెంటనే పంపించాలి. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (నుంచి నిధులు మంజూరు చేయడంతోపాటు SDRFలో కేంద్ర వాటాను వెంటనే విడుదల చేయాలి. తాగు, సాగునీటి అవసరాలు, చెరువులు, జలవనరుల పునరుజ్జీవనం మరియు నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి ₹20 వేల కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలి. వీబీజీ రాంజీ పథకం కింద ఇచ్చే 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజులు పెంచి, మొత్తం వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలి.

**రాష్ట్రానికి ₹20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి**

-కేంద్రానికి తెలంగాణ అసెంబ్లీ విజ్ఞప్తి

రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితుల వల్ల తలెత్తిన తీవ్ర వర్షాభావం, పంటల నష్టం, తాగు మరియు సాగు నీటి ఎద్దడి నుంచి రైతులను, గ్రామీణ ప్రజలను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, కరువు నివారణ చర్యల కోసం ₹20,000 కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజీని మంజూరు చేయాలని కోరుతూ సభ తీర్మానాన్ని ఆమోదించింది.

# దానం అనర్హత తీర్పుతో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి బట్టబయలు

- హైకోర్టు తీర్పు స్పీకర్ వ్యవహారశైలిపై ప్రశ్నలు లేవనెత్తింది
- ప్రజల తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవించలేదని హరీశ్‌రావు విమర్శ
- పార్టీ ఫిరాయింపులపై రాహుల్ గాంధీ హామీలను గుర్తుచేసిన మాజీ మంత్రి
- ఫిరాయింపు ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించాలని డిమాండ్
- కొత్తగా ప్రజా తీర్పు కోరేలా సీఎం రేవంత్‌రెడ్డిని ఆదేశించాలని సూచన

**హైదరాబాద్, సెప్టెంబర్ 18, ఆశ్వి అప్డేట్స్:**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని స్పష్టం చేసిందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ విషయంలో అనుసరిస్తున్న తీరుపై ఎక్స్ వేదికగా ప్రశ్నలు సంధించారు.

**ప్రజా తీర్పును విస్మరించారని ఆరోపణ**

దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి అనంతరం కాంగ్రెస్‌లో చేరారని హరీశ్‌రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలోనూ ఎమ్మెల్యే పదవిలో కొనసాగారని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు పవిత్రతను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి, స్పీకర్



నిర్ణయం ద్వారా ఆయనకు రక్షణ కల్పించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో హైకోర్టు జోక్యం చేసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తీరని మచ్చగా మిగిలిందన్నారు.

**రాహుల్ హామీపై నిలదీత**

2024 ఎన్నికల మేనిఫెస్టోలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ప్రజాప్రతినిధులపై స్వయంచాలకంగా అనర్హత వేటు పడేలా పదో షెడ్యూల్‌ను సవరించాలని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి దేశవ్యాప్తంగా మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఫిరాయింపులు జరిగినప్పుడు అదే నిబద్ధత ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. రాజకీయ అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగంపై వైఖరి మారుతోందా అని నిలదీశారు.

**ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

హైకోర్టు తీర్పు నేపథ్యంలో పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లను స్పీకర్ చట్ట ప్రకారం పరిష్కరించాలని హరీశ్‌రావు కోరారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజల తీర్పు కోరేలా సీఎం రేవంత్‌రెడ్డిని రాహుల్ గాంధీ ఆదేశించాలని డిమాండ్ చేశారు.



# పోలీసు సిబ్బంది పునర్వ్యవస్థీకరణతో సత్ఫలితాలు

- 376 మంది సిబ్బంది తిరిగి విధుల్లోకి.. 103 వాహనాలు అందుబాటులోకి
- పునర్వ్యవస్థీకరణతో రూ.90 కోట్ల ఆదా.. అక్టోబర్‌లో దక్షిణాది డీజీపీల సదస్సు




**ఆశ్వి అప్డేట్స్ – హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

తెలంగాణ పోలీసుశాఖలో చేపట్టిన సిబ్బంది పునర్వ్యవస్థీకరణ, వనరుల హేతుబద్ధీకరణతో సత్ఫలితాలు వస్తున్నాయని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. వివిధ పదవీ విరమణ చేసిన ఉద్యోగుల వద్ద విధులు నిర్వహిస్తున్న 376 మంది పోలీసు సిబ్బందిని తిరిగి పోలీసుశాఖలో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు 103 వాహనాలను పునర్వినియోగంలోకి తెచ్చినట్లు వెల్లడించారు. ఈ చర్యల ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.90 కోట్ల మేర ఆదా జరిగినట్లు తెలిపారు.

డీజీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్టాఫ్ ఆఫీసర్ల సమావేశంలో మానవ వనరుల ఆడిట్, పునర్వ్యవస్థీకరణపై సమీక్షించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల్లో 573 మంది సిబ్బందికి చెల్లిస్తున్న 60 శాతం అదనపు చెల్లింపులను ఉపసంహరించడం ద్వారా సుమారు రూ.28.16 కోట్ల ఆదా జరిగినట్లు డీజీపీ తెలిపారు.

**అక్టోబర్‌లో దక్షిణాది డీజీపీల సదస్సు**

దక్షిణాది రాష్ట్రాల డీజీపీల ప్రాంతీయ సదస్సుకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను డీజీపీ ఆదేశించారు. అక్టోబర్‌లో జరగనున్న సదస్సులో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వామపక్ష తీవ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, తీర ప్రాంత భద్రత, కొత్తగా ఉద్భవిస్తున్న నేర ధోరణులపై చర్చించనున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా 'ఫిట్ కాప్'**

పోలీసు సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమంపై దృష్టి సారిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 'ఫిట్ కాప్' కార్యక్రమాన్ని అమలు చేయాలని డీజీపీ నిర్ణయించారు. ప్రాథమిక ఆరోగ్య పరీక్షలతో పాటు థైరాయిడ్, మధుమేహం, పోషకాహారం, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించనున్నారు. ఆరోగ్య సమస్యలను తొలిదశలో గుర్తించి అవసరమైన వైద్య సహాయం అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

**డీఎస్పీల పదోన్నతులపై సమీక్ష**

రాష్ట్రంలో ఐజీ, ఆపై స్థాయిలో 48 పోస్టులు ఉండగా ప్రస్తుతం 24 పోస్టులు అందుబాటులో ఉన్నాయని డీజీపీ తెలిపారు. డీఐజీ స్థాయిలో 11 పోస్టులు ఉండగా భవిష్యత్తులో మరో 10 పోస్టులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. 1992, 1995, 1996 బ్యాచ్‌ల అధికారులకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి కల్పించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

అలాగే హోంగార్డుల కొరత, పోలీసు నియామక ప్రక్రియ, ఐపీఎస్ అధికారుల నూతన సంఘం ఏర్పాటు, 'క్యూర్ ఏరియా' కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాలు, పరిపాలన, బడ్జెట్, సంక్షేమ అంశాలపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు.

**అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం**

అక్టోబర్ 21న నిర్వహించనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని డీజీపీ సూచించారు. రక్తదాన శిబిరాలు, ఓపెన్‌హౌస్‌లు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం, బాలల భద్రత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. పోలీసుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు పోలీసు శాఖకు, సమాజానికి మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడమే కార్యక్రమాల ఉద్దేశమని డీజీపీ తెలిపారు.



# రాంపూర్‌లో గ్రీన్ డే కార్యక్రమం

**ఆశ్వి అప్డేట్స్ – నిజాంపేట:**

నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ ప్రాథమిక పాఠశాల ప్రీప్రైమరీ విభాగంలో శుక్రవారం గ్రీన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, మొక్కల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్శ రాములు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ రజితతో పాటు ఉపాధ్యాయులు సృజన, శ్యామలత, రేఖ పాల్గొన్నారు.



# సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన మధుయాష్కి గౌడ్

- **జీవో 118 బాధితుల సభకు ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష**

**ఆశ్వి అప్డేట్స్ – హైదరాబాద్:**

జీవో 118 బాధితులతో ఈ నెల 19న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న సభకు సంబంధించిన ఏర్పాట్లను ఏఐసీసీ చైర్‌పర్సన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ శుక్రవారం పరిశీలించారు. సభకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. జీవో 118 పరిధిలోని రిజిస్ట్రేషన్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు హక్కు పత్రాల అందజేతకు సంబంధించిన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరు కానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లు, వేదిక, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలను మధుయాష్కి గౌడ్ పరిశీలించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను సూచించారు.



# వంటగది లేక పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు

- **మధ్యాహ్న భోజనం తయారీలో ఇబ్బందులు.. వంటగది నిర్మించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి**

**ఆశ్వి అప్డేట్స్ – నిజాంపేట:**

నిజాంపేట మండల పరిధిలోని కాశీంపూర్ తాండ గ్రామంలోని ఎంపీపీఎస్ ప్రీప్రైమరీ పాఠశాలలో వంటగది సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు తెలిపారు. ఈ పాఠశాలలో సుమారు 35 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వంటగది లేకపోవడంతో మధ్యాహ్న భోజనం తయారీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, విద్యార్థులకు భోజనం అందించే విషయంలో సౌకర్యాల కొరత ఉందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలను పరిశీలించి, విద్యార్థుల ఇబ్బందులను పరిష్కరించేందుకు వంటగది నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



# TGSRTC గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

- **ఎనిమిదేళ్ల తర్వాత ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం.. అక్టోబర్ 9న పోలింగ్**

**ఆశ్వి అప్డేట్స్ – హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) గుర్తింపు సంఘం ఎన్నికలకు అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న ఎన్నికల ప్రక్రియ ఈ నెల 21 నుంచి ప్రారంభం కానుంది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 21 నుంచి నామినేషన్ల స్వీకరణ తదితర కార్యక్రమాలు ప్రారంభం కానుండగా, అక్టోబర్ 9న పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబర్ 17న ఎన్నికల ఫలితాలను వెల్లడించనున్నట్లు అధికారులు ప్రకటించారు. కాగా, చివరిసారిగా 2016 జూలై 19న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత సుదీర్ఘ విరామం అనంతరం తాజాగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆర్టీసీ కార్మిక సంఘాల్లో ఎన్నికల సందడి నెలకొంది.







# బైక్ బజార్ల దోపిడీ ఆరోపణలు.. వినియోగదారుల విలవిల

- **నాసిరకం రిపేర్లు.. పాత బైక్‌లకు కొత్త రంగులు**
- **అధిక వడ్డీ ఫైనాన్స్.. ఈఎంఐ ఆలస్యమైతే బెదిరింపుల ఆరోపణలు**
- **'సెటిల్మెంట్' పేరుతో వాహనాలు తీసుకుంటున్నారన్న ఫిర్యాదులు**

**ఎల్బీనగర్, ఆశ్వి అప్డేట్స్:**

ఎల్బీనగర్ పరిధిలోని కొన్ని బైక్ బజార్లు, వాటికి అనుబంధంగా కొనసాగుతున్న ఫైనాన్స్ వ్యవహారాలపై వినియోగదారుల నుంచి పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ ధరకు ద్విచక్ర వాహనం కొనుగోలు చేయాలనుకునే సామాన్యులను లక్ష్యంగా చేసుకుని కొన్ని చోట్ల నాసిరకం మరమ్మతులు చేసిన పాత బైక్‌లను కొత్తవాటిలా చూపించి విక్రయిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వాహనం కొనుగోలు సమయంలో పూర్తి వివరాలు వెల్లడించకుండా ఫైనాన్స్ ఏర్పాటు చేసి, అధిక వడ్డీ భారం మోపుతున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తక్కువ ఆదాయం కలిగిన వినియోగదారులు ఈఎంఐల చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో రికవరీ పేరుతో ఒత్తిడి పెరుగుతోందని పలువురు చెబుతున్నారు.

**రోడ్డుపైనే సీజింగ్ హంగామా?**

కొన్ని సందర్భాల్లో ఈఎంఐలు ఆలస్యమైనప్పుడు ఫైనాన్స్ సిబ్బంది పేరుతో పలువురు వ్యక్తులు వాహనదారులను రోడ్డుపైనే అడ్డుకుని వాహనాలు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఐదారు మంది వ్యక్తులు గుంపుగా వచ్చి వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కొందరు వినియోగదారులు చెబుతున్నారు.

అయితే వాహనం రికవరీకి సంబంధించి చట్టబద్ధమైన ప్రక్రియ ఏమిటి? రుణ ఒప్పందంలో పొందుపరిచిన నిబంధనలు ఏమిటి? వాటిని పాటిస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత అవసరమని వినియోగదారులు కోరుతున్నారు. బకాయిల వసూలు పేరుతో బెదిరింపులు, దౌర్జన్యం జరిగితే సంబంధిత అధికారులు విచారణ చేపట్టాలని వారు కోరుతున్నారు.

**'సెటిల్మెంట్' పేరుతో వాహనాల వ్యవహారం?**

ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితుల్లో కొందరు వినియోగదారులతో 'సెటిల్మెంట్' పేరుతో వాహనాలను తీసుకుని, వాటి మార్కెట్ విలువకు తగిన పరిహారం ఇవ్వకుండా తక్కువ మొత్తంతో వ్యవహారాన్ని ముగిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

వాహనం ప్రస్తుత మార్కెట్ విలువ, ఇప్పటికే చెల్లించిన ఈఎంఐలు, మిగిలిన బకాయిలు, వాహనం విక్రయం ద్వారా వచ్చిన మొత్తం తదితర వివరాలను వినియోగదారులకు పారదర్శకంగా తెలియజేస్తున్నారా లేదా అనే అంశంపై కూడా పరిశీలన అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**అధికారుల దృష్టి సారించాలి**

పాత వాహనాల విక్రయం, వాటి కండిషన్, పత్రాలు, ఫైనాన్స్ ఒప్పందాలు, వడ్డీ రేట్లు, రికవరీ విధానం, వాహనాల సీజింగ్ ప్రక్రియ వంటి అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

ప్రత్యేకంగా రవాణా శాఖ, పోలీసులు, వినియోగదారుల పరిరక్షణ విభాగం, సంబంధిత ఆర్థిక నియంత్రణ సంస్థలు సమన్వయంతో విచారణ చేపడితే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. వినియోగదారుల ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారులు, ఫైనాన్స్ సంస్థల వాదనలను కూడా అధికారులు నమోదు చేసి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని పలువురు కోరుతున్నారు.

# కేటీఆర్ పీఆర్వో మహేశ్ మాణిక్యకు 35(3) నోటీసు

- **బొల్లారం పోలీసుల విచారణ అనంతరం విడుదల**

**ఆశ్వి అప్డేట్స్ – హైదరాబాద్:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఆర్వో మహేశ్ మాణిక్య ముదిరాజ్‌ను బొల్లారం పోలీసులు గురువారం రాత్రి సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బొల్లారం పీఎస్‌కు తరలించి విచారించారు. బొల్లారం చెక్‌పోస్టు వద్ద పోలీసుల విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలపై ఈ కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

విచారణ అనంతరం శుక్రవారం తెల్లవారుజామున మహేశ్ మాణిక్యకు BNSS సెక్షన్ 35(3) కింద నోటీసు ఇచ్చి విడుదల చేసినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి.

ఈ కేసు సెప్టెంబర్ 8న బొల్లారం చెక్‌పోస్టు వద్ద చోటుచేసుకున్న ఘటనకు సంబంధించినదని పోలీసులు పేర్కొన్నారు. పోలీసుల ఫిర్యాదు ఆధారంగా BNS సెక్షన్లు 132, 223 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆరోపణలు ఇంకా దర్యాప్తు దశలోనే ఉన్నాయి.

ఇదిలా ఉండగా, కేటీఆర్ పీఆర్వో మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్‌రెడ్డిలకు సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన మరో కేసులోనూ విచారణ ఎదురైంది. ఈ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులోనూ పిటిషన్ దాఖలైన



విషయం తెలిసిందే.

మరోవైపు ఫార్ములా ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ శుక్రవారం నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. తదుపరి విచారణను అక్టోబర్ 30కి కోర్టు వాయిదా వేసింది.

# పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు

- **చండూర్ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని వార్షికంగా తనిఖీ చేసిన ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**ఆశ్వి అప్డేట్స్ – నల్లగొండ, సెప్టెంబర్ 18:**

చండూర్ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ శుక్రవారం వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు.

అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, రికార్డు గదులు, సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ ట్రయల్ కేసులు, కోర్టు కేసుల వివరాలను సమీక్షించారు.

ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, ఆధారాలను పకడ్బందీగా సేకరించాలని, నిర్ణీత సమయంలో చార్జిషీట్లు దాఖలు చేయాలని అధికారులకు సూచించారు. క్రైమ్ రిజిస్టర్, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్, సీడీ ఫైల్స్, కోర్టు కేసుల రికార్డులు, బీట్ బుక్స్ తదితర రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలు, నేరాలకు అవకాశం ఉన్న ప్రదేశాలు, గతంలో నేరాలు జరిగిన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు.

గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను గౌరవంగా విని, చట్టపరిధిలో తక్షణమే స్పందించాలని సిబ్బందికి తెలిపారు.





ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు పోలీస్ శాఖపై నమ్మకం పెరిగేలా సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు.

అనంతరం పోలీస్ సిబ్బంది సంక్షేమానికి సంబంధించిన అంశాలను కూడా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధులు, సెలవులు, వసతులు, ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ తనిఖీలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, చండూర్ సీఐ రాము, డీసీఆర్బీ సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ శివకుమార్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, చండూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# హిందూ–ముస్లిం ఐక్యతకు ప్రతీక తాండూర్

- **వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**

**ఆశ్వి అప్డేట్స్ – తాండూర్, సెప్టెంబర్ 18:**

తాండూర్ పట్టణంలో నిర్వహించనున్న వినాయక నిమజ్జన కార్యక్రమం సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. పాత తాండూర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించి విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

అనంతరం పాత తాండూర్ శివాజీ ఉత్సవ కమిటీ సభ్యులు, దర్గా కమిటీ సభ్యులతో ఎస్పీ సమావేశమై నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ తాండూర్ పట్టణం హిందూ-ముస్లిం ఐక్యతకు, గంగా-జమునా తెహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. అన్ని మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ సోదరభావంతో మెలగడం తాండూర్ ప్రత్యేకత అని పేర్కొన్నారు. వినాయక నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు పోలీసుల సూచనలు, నిర్దేశిత మార్గాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్, తాండూర్ డీఎస్పీ యాదయ్య, టౌన్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.





# మొదట ఓటు చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ!

- **ఎన్నికల సంఘంపై రాహుల్ తీవ్ర విమర్శలు**
- **తృణమూల్ పేరు, గుర్తు ఫ్రీజ్‌పై ఆగ్రహం**
- **బీజేపీ-ఈసీ చేతులు కలిపాయని ఆరోపణ**
- **ప్రజల తీర్పును కాపాడాలని డిమాండ్**
- **స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం పోరాడతామని వెల్లడి**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 , ఆశ్వి అప్డేట్స్ :**

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పేరు, 'పువ్వులుగడ్డి' ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా ఫ్రీజ్ చేయడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పం దించారు. "మొదట ఓటు చోరీ.. తర్వాత ప్రభుత్వాల చో రీ.. ఇప్పుడు పార్టీ చోరీ" అంటూ శుక్రవారం సామాజిక మాధ్యమం 'ఎక్స' వేదికగా విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యం దిగజారుతోందనడానికి తాజా పరిణామమే నిదర్శనమని ఆయన ఆరోపించారు. తృణమూల్‌లో మమతా బెనర్జీ, రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని రెండు వర్గాలు పార్టీపై హక్కు తమదేనని వాదిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వివాదంపై తుది నిర్ణయం వెలువడే వరకు రెండు వర్గాలూ 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస' పేరు, రిజర్వ్ చేసిన 'పువ్వులుగడ్డి' గుర్తును ఉపయోగించకుండా ఆదేశించింది. అక్టోబర్ 6న జరగనున్న నందిగ్రామ్, రెజి నగర్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

'ప్రజల తీర్పును కాపాడాలి'

ప్రజలు ఇచ్చిన తీర్పును పరిరక్షించాల్సిన రాజ్యాంగబద్ధ బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని రాహుల్ పేర్కొన్నారు. కానీ ప్రజల తీర్పును మార్చే శక్తులకు ఈసీ సహకరిస్తోందని ఆరోపించారు. ముందుగా బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి పనిచేస్తాయని, ఆ తర్వాత రాజకీయ పార్టీల గుర్తులపై ప్రభావం చూపుతాయని విమర్శించారు. గతంలో శివసేన, ఎన్సీపీ విషయంలోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని ఆయన ప్రస్తావించారు. ఇవన్నీ రాహుల్ గాంధీ చేసిన రాజకీయ ఆరోపణలే. ఈ పోరాటం మమతా బెనర్జీ ఒక్కరిదే కాదని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు కోరుకునే ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ఓటరుకు సంబంధించినదని రాహుల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘం గడువు మేరకు రెండు తృణమూల్ వర్గాలు ప్రత్యామ్నాయ పేర్లు, గుర్తులను సమర్పించాయి. అనంతరం మమతా బెనర్జీ వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస' పేరు, 'ఫుట్‌బాల్ ప్లేయర' గుర్తును, ప్రత్యర్థి వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస' పేరు, 'ఎన్వలప' గుర్తును ఎన్నికల సంఘం కేటాయించినట్లు తాజా సమాచారం.

# దేశ రాజధాని ఢిల్లీలో దారుణం

- **16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం, హత్య..**
- **రెండు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు**
- **నలుగురు నిందితుల్లో ముగ్గురు మైనర్లు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 , ఆశ్వి అప్డేట్స్ :**

దేశ రాజధాని ఢిల్లీలో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిపి హత్య చేసినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపింది. స్వరూప్‌నగర్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో 19 ఏళ్ల యువకుడితోపాటు ముగ్గురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో బాలికకు పరిచయమున్న 17 ఏళ్ల బాలుడు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. గత శుక్రవారం రాత్రి బాలిక తనకు పరిచయమున్న 17 ఏళ్ల బాలుడిని కలిసేందుకు వెళ్లింది. అనంతరం అతడు మరో ముగ్గురితో కలిసి బాలికను తీసుకెళ్లినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. ఆమెపై నలుగురూ సామూహిక అత్యాచారానికి పాల్పడి, హత్య చేసి మృతదేహాన్ని కుషాక్ రోడ్డుకు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో పడేసినట్లు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల తర్వాత ఆదివారం స్థానికులు బాలిక మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం తీవ్రంగా దెబ్బతిని ఉండటంతో తొలుత గుర్తింపు కష్టమైనట్లు పోలీసులు తెలిపారు. కనీసం లింగ నిర్ధారణ చేయలేని పరిస్థితుల్లో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఆమె మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నాయని, ఒక చేయి వేరుగా పడి ఉన్నట్టు గుర్తించామన్నారు. మరోవైపు.. బాలిక అదృశ్య ఘటనపై ఆమె కుటుంబ సభ్యులెవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. ఆమె తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లేదని, కొద్ది రోజుల తర్వాత తిరిగి వస్తుండేదని వారు చెప్పారన్నారు. పోస్టుమార్టం నివేదిక, ఇతర ఆధారాల ఆధారంగా సామూహిక అత్యాచారం, హత్య కోణంలో దర్యాప్తు చేపట్టారు. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులు నలుగురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిలో ఒకరికి 19 ఏళ్లు కాగా, మిగిలిన ముగ్గురు మైనర్లని పేర్కొన్నారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అపహరణ, అత్యాచారం, హత్యతోపాటు పోక్సో చట్టంలోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# స్పామ్ కాల్స్‌కు ట్రాయ్ కొత్త చెక్!

- **అనవసర కాల్స్, సందేశాలపై మరింత కఠిన నిబంధనలు**
- **మూడు ఫిర్యాదులతోనే అనుమానిత నంబర్‌పై చర్య**
- **వినియోగదారులకు కొత్త అప్పీల్ అవకాశం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18, ఆశ్వి అప్డేట్స్ :**

మొబైల్ వినియోగదారులను వేధిస్తున్న స్పామ్ కాల్స్, అనవసర వాణిజ్య సందేశాలకు అడ్డుకట్ట వేసేందుకు భారత టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, టెలికాం సంస్థల మధ్య సమాచార మార్పిడి, వినియోగదారులకు అదనపు రక్షణ కల్పించేలా వాణిజ్య సమాచార నియంత్రణ నిబంధనల్లో మూడో సవరణను సెప్టెంబర్ 18న విడుదల చేసింది. కొత్త నిబంధనల ప్రకారం స్పామ్‌కు ఎక్కువగా ఉపయోగించే అవకాశం ఉన్న నంబర్లను టెలికాం సంస్థలు ముందుగానే గుర్తించాలి. ఆ సమాచారాన్ని ఇతర ఆపరేటర్లతో పంచుకోవడంతోపాటు అనుమానిత నంబర్ల గుర్తింపు వివరాలను మళ్లీ తనిఖీ చేయాలి. స్పామ్‌కు పాల్పడుతున్నట్లు నిర్ధారణైతే నంబర్‌ను నిలిపివేసే వరకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. వాణిజ్య, అధికారిక సమాచారానికి కేటాయించిన ప్రత్యేక నంబర్ సిరీస్‌లకు కూడా స్పష్టమైన రక్షణ కల్పించారు. ముఖ్యంగా నియంత్రిత సంస్థల సేవలు, లావాదేవీల కాల్స్‌కు ఉపయోగించే 1600 సిరీస్ నంబర్లను స్పామ్‌గా ట్యాగ్ చేయడం, బ్లాక్ చేయడం లేదా ఫిల్టర్ చేయడం అనుమతించబడదని ట్రాయ్ ఇప్పటికే స్పష్టం చేసింది. 140 సిరీస్ ప్రధానంగా ప్రచార కాల్స్‌కు వినియోగిస్తారు. స్పామ్‌ను గుర్తించే కాల్ మేనేజ్‌మెంట్, థర్డ్ పార్టీ యాప్‌ల విషయంలోనూ కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. టెలికాం సంస్థల నుంచి స్పామ్‌కు సంబంధించిన సమాచారాన్ని పొందాలంటే ఆయా యాప్‌లు తమ వద్ద ఉన్న సంబంధిత సమాచారాన్ని తిరిగి ఆపరేటర్లతో పంచుకోవాల్సి ఉంటుంది. దీంతో స్పామ్ నంబర్లను వేగంగా గుర్తించి చర్యలు తీసుకునే వ్యవస్థ బలోపేతం కానుంది. అలాగే ఒక నంబర్‌పై చర్యకు అవసరమైన ఫిర్యాదుల పరిమితిని ఐదు నుంచి మూడుకు తగ్గించారు.

# నందిగ్రామ్ ఉపఎన్నికలో మమతకు షాక్

- **మమతా వర్గం అభ్యర్థి సంచిత ప్రధాన్ దేవ్ అనూహ్యంగా వైదొలగింపు**
- **నామినేషన్ల ఉపసంహరణకు ఒక్కరోజు ముందు కీలక నిర్ణయం**
- **కాంగ్రెస్‌కు పూర్తి మద్దతు ప్రకటించిన మమతా బెనర్జీ**
- **నబన్నలో సీఎం సువేందు అధికారితో భేటీ అనంతరం నామినేషన్ ఉపసంహరణ**
- **టీఎంసీ వర్గాలకు వేర్వేరు పేర్లు, గుర్తులు కేటాయించిన ఎన్నికల సంఘం**
- **బీజేపీ ప్రతిపక్షాలను బలహీనపరుస్తోందని మమతా బెనర్జీ ఆరోపణ**

**కోల్‌కతా, సెప్టెంబర్ 18, ఆశ్వి అప్డేట్స్:**

బంగాల్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అక్టోబర్ 6న జరగనున్న నందిగ్రామ్ అసెంబ్లీ ఉపఎన్నికలో మమతా బెనర్జీ వర్గం తరపున పోటీ చేస్తున్న సంచిత ప్రధాన్ దేవ్ అనూహ్యంగా బరిలో నుంచి తప్పుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువుకు ఒక్కరోజు ముందు ఆమె తన నామినేషన్‌ను వెనక్కి తీసుకున్నారు. దీంతో నియోజకవర్గంలో మమతా వర్గానికి అభ్యర్థి లేకుండా పోయింది.

**కాంగ్రెస్‌కు మద్దతు**

సంచిత ప్రధాన్ దేవ్ నామినేషన్ ఉపసంహరించుకున్న కొన్ని గంటల్లోనే మమతా బెనర్జీ కీలక ప్రకటన చేశారు. నందిగ్రామ్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌కు తమ వర్గం పూర్తి మద్దతు ఇస్తుందని వెల్లడించారు. ప్రతిపక్షాల ఐక్యతకు రాహుల్ గాంధీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సంఘీభావం ప్రకటించారని తెలిపారు. బీజేపీకి వ్యతిరేకంగా అందరం కలిసికట్టుగా పోరాడతామని స్పష్టం చేశారు.

**నబన్నలో భేటీ తర్వాతే..**

నామినేషన్ ఉపసంహరించుకున్న సంచిత ప్రధాన్ దేవ్ తన భర్త సత్యజిత్‌తో కలిసి బంగాల్ సచివాలయం నబన్నకు వెళ్లారు. అక్కడ సీఎం సువేందు అధికారితో సమావేశమయ్యారు. భేటీ ముగిసిన వెంటనే ఆమె నామినేషన్ ఉపసంహరించుకోవడం రాజకీయంగా చర్చకు దారితీసింది. ఈ పరిణామంపై మమతా వర్గం నుంచి వివరణ వెలువడాల్సి ఉంది.

**టీఎంసీ వర్గాలకు వేర్వేరు గుర్తులు**

టీఎంసీ పేరు, ఎన్నికల గుర్తుపై ప్రత్యర్థి వర్గాల మధ్య వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. మమతా నేతృత్వంలోని వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరుతో 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును కేటాయించింది. అరూప్ రాయ్ నేతృత్వంలోని వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరుతో 'ఎన్వలప్' గుర్తును ఇచ్చింది.



**ప్రజాస్వామ్యానికి చీకటి రోజంటూ మమత వ్యాఖ్య**

తమ పార్టీ సాంప్రదాయ ఎన్నికల గుర్తును తొలగించడాన్ని మమతా బెనర్జీ తీవ్రంగా వ్యతిరేకించారు. 28 ఏళ్లుగా తమ పార్టీ వద్ద ఉన్న గుర్తును ఎన్నికల సంఘం ఎలా స్తంభింపజేస్తుందని ప్రశ్నించారు. ఈ పరిణామాన్ని ప్రజాస్వామ్యానికి చీకటి రోజుగా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలను విచ్ఛిన్నం చేసి బలహీనపరచడమే బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. టీఎంసీలోని తిరుగుబాటు నేతలు బీజేపీకి పనిచేస్తున్నారని విమర్శించారు. నిన్నటి వరకు తమ పార్టీ గుర్తుపై గెలిచిన వారే ఇప్పుడు అదే గుర్తును సవాల్ చేయడం దారుణమని మమత వ్యాఖ్యానించారు.

# పాక్ ఆరోపణలను తిప్పికొట్టిన భారత్

- **అరేబియా సముద్రంలో నౌకల ఢీకొన్న ఘటనపై ఇస్లామాబాద్ వాదనలకు భారత్ ఖండన**
- **పీఎన్ఎస్ హునైన్ ప్రమాదకర ఓవర్‌టేకింగ్ వల్లే ఘటన జరిగిందన్న జైస్వాల్**
- **1991 భారత్–పాక్ ఒప్పందంలోని ఆర్టికల్ 10 ఉల్లంఘన**
- **అంతర్జాతీయ సముద్ర నిబంధనలకూ పాక్ నౌక విరుద్ధంగా వ్యవహరించిందని వెల్లడి**
- **ఐఎన్ఎస్ కోల్‌కతాకు పెద్దగా నష్టం లేదని స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18, ఆశ్వి అప్డేట్స్:**

అరేబియా సముద్రంలో భారత యుద్ధనౌక, పాకిస్థాన్ నౌక ఢీకొన్న ఘటనపై ఇస్లామాబాద్ చేసిన ఆరోపణలను భారత్ తిరస్కరించింది. పాకిస్థాన్ ఇచ్చిన వివరణను 'ఎప్పటిలాగే వాస్తవాలను పక్కదారి పట్టించే ప్రయత్నం'గా విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ అభివర్ణించారు. పాకిస్థాన్ నౌక ప్రమాదకరంగా ఓవర్‌టేక్ చేయడంతోనే ఈ ఘటన చోటుచేసుకుందని ఆయన స్పష్టం చేశారు.

**ఒప్పంద నిబంధనల ఉల్లంఘన**

ఉత్తర అరేబియా సముద్రంలో సాధారణ గస్తీ విధుల్లో ఉన్న ఐఎన్ఎస్ కోల్‌కతా వద్దకు పాకిస్థాన్ నౌక పీఎన్ఎస్ హునైన్ అధిక వేగంతో చేరి ప్రమాదకరంగా మలుపు తీసుకోవడంతో ఢీకొన్నట్లు భారత ప్రభుత్వం తెలిపింది. ఈ చర్య 1991 ఏప్రిల్‌లో కుదిరిన భారత్-పాక్ సైనిక విన్యాసాలు, కదలికలకు సంబంధించిన ఒప్పందంలోని ఆర్టికల్ 10కు విరుద్ధమని జైస్వాల్ పేర్కొన్నారు. ఈ నిబంధన ప్రకారం అంతర్జాతీయ జలాల్లో ఇరుదేశాల నౌకాదళ విభాగాలు ఒకదానికొకటి మూడు నాటికల్ మైళ్ల కంటే దగ్గరగా ఉండకూడదు. అంతే కాకుండా సముద్రంలో నౌకల ఢీకొనడాన్ని నివారించేందుకు అమల్లో ఉన్న అంతర్జాతీయ నిబంధనలను కూడా పాకిస్థాన్ నౌక ఉల్లంఘించిందని భారత్ తెలిపింది.



**భారత్ తీవ్ర నిరసన**

ఈ ఘటనపై భారత్ ఇప్పటికే న్యూఢిల్లీలోని పాకిస్థాన్ చార్జ్ డి అఫైర్స్‌ను పిలిపించి తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇరుదేశాల మధ్య అమల్లో ఉన్న సంబంధిత ఒప్పందాలను, సముద్ర భద్రతా నిబంధనలను పాటించాలని పాకిస్థాన్‌కు సూచించింది. పాకిస్థాన్ మాత్రం ఈ ఘటన తమ ప్రత్యేక ఆర్థిక మండలిలో జరిగిందని, భారత నౌకే 'రెచ్చగొట్టే చర్య'కు పాల్పడిందని ఆరోపించింది. ఇరుదేశాలు ఘటనపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**కోల్‌కతాకు పెద్దగా నష్టం లేదు**

సెప్టెంబర్ 15న రాత్రి ఉత్తర అరేబియా సముద్రంలో ఈ ఘటన జరిగింది. భారత నౌకకు పెద్దగా నష్టం వాటిల్లలేదని, అది సముద్రంలోనే తన విధులను కొనసాగిస్తోందని జైస్వాల్ తెలిపారు. పీఎన్ఎస్ హునైన్ మాత్రం దెబ్బతినడంతో మరమ్మతుల కోసం నౌకాశ్రయానికి తిరిగి వెళ్లినట్లు సమాచారం.

# రైతాంగానికి వెన్నుదన్నుగా ప్రభుత్వం

- **ఎల్నినోపై రైతులకు ముందుగానే అవగాహన కల్పించాం**
- **పంటల ఎంపికపై ముందస్తు సూచనలు**
- **కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధిస్తాం**
- **తాగునీటికే తొలి ప్రాధాన్యత**
- **శాసనసభలో మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18, ఆశ్వి అప్డేట్స్:**

రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్ నినోపై శాసనసభలో శుక్రవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో పాల్గొంటూ ఇది రైతు ప్రభుత్వం.. అన్నదాతలను ఒంటరిగా వదలబోమన్నారు. ఎల్ నినో తీవ్రతపై ముందుగానే రైతులకు అవగాహన కల్పించామన్నారు. వర్షపాతం తగ్గే అవకాశం, సాగునీటి కొరతపై అన్నదాతలను అప్రమత్తం చేశామని తెలిపారు. రైతులు నష్టపోకుండా పంటల ఎంపికపై ముందస్తు సూచనలు ఇచ్చాం. ఆయకట్టు వారీగా నీటి లభ్యతపై ఖచ్చితమైన సమాచారం అందిస్తున్నాం. ప్రతి మంగళవారం రైతు నేస్తం ద్వారా జలాశయాల పరిస్థితిని వివరిస్తున్నాం. నీరు సరిపోని చోట పంటలు వేయమని చెప్పడం బాధ్యతారాహిత్యమవతుందన్నారు. ప్రజల తాగునీటికే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుంది. తాగునీటి అవసరాలు తీర్చిన తరువాతే మిగులు జలాలను సాగుకు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే వేసవినిదృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే నీటి నిల్వలను పరిరక్షిస్తున్నామని గుర్తుచేశారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నీటి బడ్జెట్ అమలు చేస్తున్నాం. జలాశయాల నిల్వలు, కొత్త ప్రవాహాలను పది రోజులకోసారి సమీక్షిస్తాం. శ్రీశైలంలో వినియోగయోగ్యమైన నీరు గత ఏడాది 153.56 టీఎంసీలు.. ప్రస్తుతం 61.65 టీఎంసీలే వున్నాయన్నారు. నాగార్జునసాగర్‌లో గత సంవత్సరం 174.25 టీఎంసీలుండగా ఈసారి 44.89 టీఎంసీలే వున్నాయన్నారు. జలాశయాల్లో కనిపించే మొత్తం నీరు సాగుకు అందుబాటులో ఉన్నట్లు కాదు. రాష్ట్రంలోని 44,034 చెరువుల్లో 40 శాతం పావు సామర్థ్యం కన్నా తక్కువగా నిండాయి. వాస్తవాలను దాచకుండా నీటి పరిస్థితిని ప్రజల ముందు ఉంచుతున్నాం. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటాను సాధించి తీరుతామని స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ఒక్క చుక్క నీటినీ వదులుకోబోమన్నారు. కృష్ణా జలాల కోసం ట్రిబ్యునల్, కేఆర్ఎంబీ, కేంద్రం వద్ద బలంగా వాదనలు వినిపిస్తున్నామన్నారు. కృష్ణా జలాల్లో 66:34 తాత్కాలిక నిష్పత్తిని శాశ్వత హక్కుగా అంగీకరించలేదని గుర్తుచేశారు. కృష్ణా జలాల్లో 50:50 పంపిణీ కోసం తెలంగాణ పట్టుబట్టింది. మేడిగడ్డ ఏడో బ్లాక్ దెబ్బతినడంతో నీటి మళ్లింపునకు పనికిరాని పరిస్థితి ఏర్పడింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ప్రస్తుతం నీటి నిల్వకు సురక్షితం కావని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసిందన్నారు. ప్రజల ప్రాణభద్రతను పణంగా పెట్టి కాళేశ్వరం బ్యారేజీలను వినియోగించలేమన్నారు. చిన్న మరమ్మతుతోనే కాళేశ్వరాన్ని నడపవచ్చన్న బీఆరఎస్ వాదన సాంకేతికంగా తప్పన్నారు. ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారమే బ్యారేజీల పునరుద్ధరణ చేపడతామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో సురక్షితంగా ఉన్న లింక్-2 ద్వారా పంపింగ్ కొనసాగిస్తున్నామన్నారు. పాలమూరురంగారెడ్డి పథకం 90 శాతం పూర్తయిందన్న బీఆర్ఎస్ ప్రచారం అవాస్తవం. కేవలం పంప్‌హౌస్‌లు నిర్మిస్తే ఎత్తిపోతల పథకం పూర్తయినట్లు కాదన్నారు. పాలమూరురంగారెడ్డిలో కాలువలు, పంపిణీ వ్యవస్థ, భూసేకరణ, పునరావాస పనులు అసంపూర్తిగా ఉన్నాయని గుర్తుచేశారు. చట్టబద్ధ అనుమతులు, మిగిలిన నిర్మాణాలు పూర్తిచేసి పాలమూరు-రంగారెడ్డిని వినియోగంలోకి తెస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ ప్రాధాన్య క్రమంలో పూర్తిచేస్తామన్నారు. కాలువల మరమ్మతులు, పంపింగ్ వ్యవస్థల పునరుద్ధరణను వేగవంతం చేస్తున్నామన్నారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను సమర్థంగా వినియోగిస్తామన్నారు. నిలిచిన పంటల రక్షణతోపాటు యాసంగి అవసరాలకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఎల్ నినోను ఆపలేకపోయినా దాని ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతుల పంటలు, ప్రజల తాగునీరు, రాష్ట్ర జలహక్కుల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని మరోమారు స్పష్టం చేశారు.



నీటి అవసరాలకు ప్రాధాన్యత : సీతక్క

మంత్రి సీతక్క మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం వరకు తాగు నీటి అవసరాలకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నామన్నారు. రిజర్వాయర్ల నీటి వినియోగానికి సంబంధించి తాగు నీటికే ప్రథమ ప్రాధాన్యత నిస్తున్నాం. ప్రతిరోజూ అన్ని జలాశయాల్లోని నీటి మట్టాలను పర్యవేక్షిస్తున్నాం. ఇరిగేషన్ శాఖ వారితో వారాని కోకసారి సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నాం.నీటి నిల్వ తగినంత అందుబాటులో లేని, ఇన్ ఫ్లోలు ఆశించనంతగా లేని రిజర్వాయర్లలో, డెడ్ స్టోరేజీ నీటిని వినియోగించుకునేందుకు వీలుగా మోటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో తాగు నీటి కోసం ప్రస్తుతం ఉపయోగిస్తున్న జలాశయాల్లో సింగూరు ఒకటే కొంత ఇబ్బందికరంగా ఉందన్నారు. ప్రస్తుతం సింగూరు ప్రాజెక్టులో నీటి నిల్వ సుమారు 75 రోజులకు సరిపోతుంది. ఆ తర్వాత వర్షాలు కురవక పోతే ఏం చేయాలి అనే ఆలోచిస్తున్నాం. సింగూరు రిజర్వాయర్‌పై 4 జిల్లాల్లోని 2,395 గ్రామీణ ఆవాసాలు , 19 పట్టణ స్థానిక సంస్థలు ఆధారపడి ఉన్నాయి. ప్రత్యామ్నాయ తాగు నీటి సరఫరా కోసం ఆవాసాల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. స్థానిక నీటి వనరులైన చేతి పంపులు, సింగిల్ ఫేజ్/త్రీ ఫేజ్ పథకాలు, బావులు సిద్ధంగా ఉంచాం. స్థానిక నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాల్లో బోర్ వెల్స్‌ను అద్దెకు తీసుకోవడం లేదా సమీపంలోని నీటి వనరుల నుంచి నీటిని తరలించడం వంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. కృష్ణా బేసిన్‌లో 14, బేసిన్‌లో 20 రిజర్వాయర్ల నీటిని వినియోగించుకుంటున్నామన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్దం చేశామన్నారు. వీబీజీరాంజీ.. పేరు ఏదైనా కరవు, కష్టకాలంలో ప్రజలకు ఉపాధి కల్పించడమే ఉపాధి హామీ పథకం లక్ష్యం. అందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీల్లో కనీసం 60 కుటుంబాలకు పని కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున పనులు ప్రారంభించాం.ఎండలు తీవ్రంగా ఉన్న ఏప్రిల్ నుంచి జూన్ వరకు రోజుకు సగటున 12 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారు. జూలై నుంచి రోజుకు సగటున 2 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ ల్లో గతంలో ఎన్నడు లేని విధంగా రికార్డు స్థాయిలో పనులు కల్పిస్తున్నాం. ఇప్పటివరకు 2 వేల కోట్లకు పైగా వేతనాలు నేరుగా కూలీలకు చెల్లించాం. వీబీ జీ రాం జీ వల్ల రాష్ట్రం మీద 40శాతం భారం పడుతోందన్నారు. ఇంటింటికీ ఇంకుడు గుంత.. ప్రతి పొలానికి పంట కుంట.. ప్రతి ఊరికి ఊట కుంట.. అనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం అని మంత్రి సీతక్క చెప్పారు.

# ఈ స్నాక్స్ తింటున్నారా?.. డేంజర్ లో పడ్డట్టే



చాలా మందికి స్నాక్స్ తినడం అలవాటు. సాయంత్రం అయ్యిందంటే చాలు స్ట్రీట్ ఫుడ్స్ షాప్స్ దగ్గరకు ఎగబడిపోతుంటారు. సమోసా, పునుగులు, మిర్చీ బజ్జీలు ఇలా ఒక్కో స్నాక్ ఐటమ్ ఒక్కొక్కరిగా ఇష్టం. అయితే అప్పడప్పడూ వీటిని తీసుకుంటే పర్వాలేదు కానీ.. రెగ్యులర్ గా ఈవినింగ్ స్నాక్స్ తీసుకుంటే డేంజర్ లో పడ్డేట్టేనని ఆహార నిపుణులు సూచిస్తున్నారు. సంతృప్త కొవ్వులు, చక్కెర, లవణాలు , శుద్ధి చేసిన పిండి కారణంగా అవి చాలా అనారోగ్యకరమైనవి. స్నాక్స్ తినడం వల్ల.. జీర్ణ సమస్యలు, గుండె ప్రమాదం, బరువు పెరుగుతారు.



### బిస్కెట్లు-కుకీలు:

బిస్కెట్లు, కుకీలను ఎక్కువగా టీ, కాఫీలో వేసుకుని తింటారు. దాదాపు.. భారతీయులందరూ ఇలా తినడానికే ఇష్టపడతారు. అయితే.. ఇలా తినడం ఆరోగ్యానికి మంచిది కాదు. ఎందుకంటే.. బిస్కెట్లలో ఉండే వెన్న, పంచదార, పిండిలో చాలా శాతం సంతృప్త కొవ్వును కలిగి ఉంటుంది. దానివల్ల జీర్ణక్రియలో ఇబ్బందులు తలెత్తుతాయి. బిస్కెట్లలో 3050 శాతం సంతృప్త కొవ్వు ఉంటుంది. సాధారణంగా బిస్కెట్‌లో 200300 కేలరీలు ఉంటాయని నిపుణులు చెబుతుంటారు. కానీ వీటిలో ఎక్కువగా పిండి, కొవ్వుల నుండి వచ్చే కార్బోహైడ్రేట్లు ఉంటాయి. పిండి పదార్థాలు ఆరోగ్యకరమైనప్పటికీ, వాటిని మితంగా మాత్రమే తీసుకోవాలి. ఆరోగ్యకరమైన డైజెస్టివ్ బిస్కెట్లలో కూడా కేవలం 20 శాతం గోధుమలు మాత్రమే ఉంటాయి. మిగిలిందంతా ఎమల్సిఫైయర్లు, పామాయిల్ ఉంటాయి. ఇవి.. ఊబకాయాన్ని కలిగిస్తాయి.

### పానీ పూరీ/గోల్ గప్పా:

ఇండియన్ స్ట్రీట్ ఫుడ్స్‌లో పానీ పూరీ ఒకటి. కొత్తిమీరపుదీనా నీరు, చింతపండు చట్నీ, బంగాళాదుంప, చిక్‌పీస్‌లతో డీప్‌ఫ్రైడ్ చేస్తారు. పానీపూరీని తినొద్దని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వర్షా కాలంలో తినొద్దని.. ఎందుకంటే కాలుష్యం వంటి ప్రమాద కారకాలు ఉంటాయని చెబుతున్నారు.

### అరటి చిప్స్:

అరటి చిప్స్ తినడానికి రుచికరంగా ఉంటాయి. అంతే తేలికగా కూడా ఉంటాయి. అరటి చిప్స్□ను పచ్చి అరటిపండ్లు, ఉప్పు, మసాలాతో తయారు చేస్తారు. ఇవి కూడా ఆరోగ్యానికి అనారోగ్యమని నిపుణులు చెబుతున్నారు. 72 గ్రాముల అరటిపండు చిప్స్ 24 గ్రాముల కొవ్వును తయారు చేస్తుంది. ఇవి తినడం వల్ల.. గుండె జబ్బుల వంటి దీర్ఘకాలిక అనారోగ్యాల ప్రమాదాన్ని పెంచుతాయి.

### కచోరీస్:

కచోరీలు కూడా అనారోగ్యకరమైనవి. ఎందుకంటే వీటిని డీప్‌ఫ్రైడ్ చేస్తారు. వీటిల్లో అధిక కేలరీలు, అనారోగ్యకరమైన కొవ్వులతో నిండి ఉంటాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఒక కచోరీలో 200300 కేలరీలు ఉంటాయి. ఇది మీ కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచి.. గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. ఆల్‌పర్పస్ పిండితో తయారు చేయబడిన కచోరిస్‌లో గణనీయమైన మొత్తంలో చక్కెర కూడా ఉంటుంది.

### మోమోస్:

మోమోస్ స్టాల్స్ ప్రతి వీధిలో ఉంటాయి. ఇవి.. రుచిగా ఉన్నప్పటికీ, మోమోస్ మీ జీర్ణ ఆరోగ్యాన్ని నాశనం చేస్తుంది. వీటిని రోజూ తినడం వల్ల మలబద్ధకం, ఆమ్లత్వం, ఉబ్బరం వంటి సమస్యలకు దారితీయవచ్చు. మోమోస్ వల్ల ఉబ్బరం, అజీర్ణం, యాసిడ్ రిఫ్లక్స్‌కు కారణమవుతుంది.







# జీరా వాటర్.. ఆరోగ్య సమస్యలు పరార్..!

వంటింటి చిట్కాలతోనే చాలా ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవచ్చు. నిత్యం మన కండ్ల ముందే కనిపించే సుగంధ ద్రవ్యాలు మన ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తాయి. అయితే మనం వాటిని నిర్లక్ష్యం చేస్తూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ వేల రూపాయలు ఖర్చు చేస్తూ ఉంటాం. అటువంటి ఓ డ్రింగ్ గురించి ఈ కథనంలో తెలుసుకుందాం. జీరా వాటర్ అనేక సమస్యలను పరిష్కరిస్తుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. జీలకర్రలో ఉండే పోషకాలు జీర్ణాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అంతే కాకుండా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు జీలకర్ర నీటిని తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

**కొవ్వు సమస్య ఉండదు..**

జీలకర్ర నీటిని తరుచూ తీసుకుంటే శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వును మాయమవుతుంది.

**గ్యాస్ ట్రబుల్ కు బెస్ట్ సొల్యూషన్**

మనలో చాలా మంది గ్యాస్ ట్రబుల్, మల బద్ధకం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. అయితే ఉదర సంబంధిత వ్యాధులకు జీరా వాటర్ బెటర్ సొల్యూషన్ అని నిపుణులు సూచిస్తున్నారు. జీలకర్ర వాటర్‌లో ఉండే పోషకాలు జీర్ణ ఎంజైమ్‌లను ప్రేరేపిస్తాయి, ఇది ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. అంతే కాకుండా గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలను తొలగించడంలో సహాయపడుతుంది.

**ఉబకాయం పోగొడుతుంది**

జీలకర్ర వాటర్ లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్.. బరువు తగ్గడంలో సహాయపడతాయి. ఇది జీవక్రియను పెంచుతుంది. అంతే కాకుండా శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తుంది. దీనితో పాటు, పేరుకుపోయిన కొవ్వును తగ్గించడంలో కూడా ఇది సహాయపడుతుంది.

**ఇమ్యూనిటీ పెంచేస్తుంది**

జీలకర్ర నీరులో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఇది అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి మిమ్మల్ని రక్షిస్తుంది. జీలకర్ర నీటిని తాగడం వల్ల సీజనల్ వ్యాధులు కూడా తగ్గుతాయి.

**చర్మ సౌందర్యానికి కూడా..**

జీల కర్ర వాటర్ తీసుకుంటే చర్మం కాంతివంతంగా తయారవుతుంది. మన చర్మంలో ఉండే అనేక మలినాలను బయటకు తరిమేస్తుంది.

**జీలకర్ర నీటిని ఎలా తయారు చేయాలి..?**

ఒక చెంచా జీలకర్రను ఒక గ్లాసు నీటిలో వేసి రాత్రంతా నానబెట్టాలి. ఈ నీటిని వడపోసి ఉదయాన్నే ఖాళీ కడుపుతో త్రాగాలి. కావాలంటే, మీరు దీనికి కొద్దిగా నిమ్మరసం కూడా కలుపుకోవచ్చు. ఇది జీలకర్ర నీటి రుచిని మరింత పెంచుతుంది.



# ఏ వయసులో ఎన్ని గంటలు నిద్రపోవాలి?



ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవితంలో చాలా మంది నిద్ర పోయేందుకు సమయం ఉండటం లేదు. దీంతో అనేక రకాల ఆరోగ్య సమసయలు వస్తున్నాయి. నిజానికి నిద్రతోనే మనకు ఎన్నో సమస్యలు దూరమవుతాయి. అయితే ప్రస్తుత జీవనశైలి. ఆఫీస్ అవర్స్ ఎక్కువగా ఉండటం.. విపరీతమైన ఒత్తిడి, ఒక్కొక్కరూ ఒకటి కంటే ఎక్కువగా ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో చాలా మంది నిద్రకు దూరమై సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. అయితే ఏ వయసు వారు ఎన్ని గంటలు నిద్రపోవాలి? ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారు? ఈ కథనంలో తెలుసుకుందాం..

**నిద్రలేమితో డేంజర్ బెల్స్**

నిద్రలేమితో అనేక శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి . నిద్రలేమి చాలా ఆరోగ్య సమస్యలకు హేతువు అని వైద్య నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎంత ఎవసరమో నిద్ర కూడా అంతే అవసరం.

**నిద్రలేకపోతే ఏం జరుగుతుంది?**

రాత్రి సరిగ్గా నిద్రపోకపోతే తరువాతి రోజు పనిలో నిరాశత్వంగా, మందకోడిగా ఉంటారు. పైగా పగటిపూట నిద్ర ముంచుకొస్తూ ఉంటుంది. ఏపని సరిగ్గా చేయలేరు. సరైన నిద్ర లేకపోతే పిల్లల్లో ఏకాగ్రత కొరవడుతుంది. జ్ఞాపక శక్తి తగ్గుతుంది. రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. నిద్ర అలసిపోయిన శరీరానికి విశ్రాంతినిచ్చి తిరిగి మరుసటి రోజు పనికి కావాల్సిన శక్తిని అందిస్తుంది.

## ఏ వయసు వారికి ఎంత నిద్ర అవసరం..

**నవజాత శిశువులు అప్పడే పుట్టిన పిల్లలు దాదాపు 18 గంటలు నిద్రపోవడం చాలా అవసరం.**

**4-11 నెలల శిశువులు– వీరు సాధారణంగా రోజుకి 1- 15 గంటలు నిద్రపోవడం చాలా అవసరం.**


**3- 5 సంవత్సరాలు ఉన్న పిల్లలు– 13 గంటలు నిద్రపోవడం చాలా అవసరం.**

**6-12 ఏళ్ల పిల్లలు– పాఠశాలకు వెళ్లే పిల్లలకు కనీసం 9-12 గంటల నిద్ర అవసరం.**

**13-18 సంవత్సరాలు వయసలో– ఈ వయసు గల పిల్లలు సుమారు 8 గంటల నిద్ర అవసరం.**

**18-60 ఏళ్లు వయసు ఉన్నవారు– ఈ వయసు గల వారు రోజుకి కనీసం 7-9 గంటలు నిద్రపోలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.**

**60 ఏళ్ల పైబడిన వారైతే వీరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. ఈ వయసు వారు కచ్చితంగా 7-8 గంటలు నిద్రపోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.**





# వయసు పెరుగుతున్న యంగ్ గా కనిపించాలంటే ఇలా చేయండి

తేనెలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. అందుకే తేనెను మందుల తయారీలో కూడా ఉపయోగిస్తారు. తేనె ఆరోగ్యానికే కాదు చర్మ సౌందర్యానికి కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. తేనెతో తయారు చేసిన ఫేస్ ప్యాక్ లను వాడటం వల్ల అందం రెట్టింపు అవుతుంది. ముఖ్యంగా 40 ఏళ్లు పై బడిన వారు ఈ ఫేస్ ప్యాక్‌లను వాడటం వల్ల యవ్వనంగా కనిపిస్తారు. వయస్సు పెరుగుతున్నా కూడా యంగ్‌గా కనిపించాలి అంటే తేనెతో తయారు చేసిన ఫేస్ ప్యాక్‌లను వాడాలి. వీటి వల్ల అనేక లాభాలు ఉంటాయి. తేనెలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్లు వయస్సు పెరుగుతున్నా కూడా అందంగా కనిపించేలా చేస్తాయి.

తేనెలో పసుసు, నిమ్మ రసం, పెరుగు , ఓట్స్‌లను కలిపి ఫేస్ ప్యాక్‌లను తయారు చేసుకుని వాడవచ్చు. మరి వీటిని ఎలా తయారు చేసుకోవాలి. వీటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### 1. తేనె, పెరుగు ఫేస్ ప్యాక్:

**కావలసినవి:** తేనె 1 టేబుల్ స్పూన్
పెరుగు 2 టేబుల్ స్పూన్లు
తయారీ విధానం:ముందుగా పైన చెప్పిన మోతాదులో తేనె, నిమ్మరసం తీసుకుని వాటిని ఒక గిన్నెలో వేసుకుని మిక్స్ చేసుకోవాలి. ఆ తర్వాత దీనిని ఫేస్ పై అప్లై చేసుకోవాలి. 1520 నిమిషాల పాటు దీనిని ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేయాలి. ఈ ఫేస్ ప్యాక్‌ను తరుచుగా ముఖానికి అప్లై చేయడం వల్ల ముఖం అందంగా మెరిసిపోతుంది. ముఖంపై ఉన్న ట్యాన్ తొలగిపోతుంది. అంతే కాకుండా ఫేస్‌పై ఉన్న మృత కణాలను ఈ ఫేస్ ప్యాక్ తొలగిస్తుంది. తరుచుగా ఈ ఫేస్ ప్యాక్ ముఖానికి అప్లై చేయడం వల్ల ముఖం యవ్వనంగా కనిపిస్తుంది.

### 2. తేనె, నిమ్మకాయ ఫేస్ ప్యాక్:

ఒక గిన్నెలో ఒక చెంచా తేనె, అర చెంచా నిమ్మరసం కలపండి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని ముఖంపై సున్నితంగా అప్లై చేయాలి. ఈ ఫేస్ ప్యాక్‌ను 15 నిమిషాల పాటు అలాగే ఉంచి, ఆపై గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోండి. ఈ ఫేస్ ప్యాక్ మచ్చలను తగ్గిస్తుందిచ. అంతే కాకుండా చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. దీని వల్ల మొటిమలు కూడా తగ్గుతాయి.

### 3. తేనె, పసుపు ఫేస్ ప్యాక్:

పసుపు, తేనెతో చేసిన ఫేస్ ప్యాక్ చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఈ రెండింటిలోనూ యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. దీని ఫేస్ ప్యాక్ కోసం, ఒక గిన్నెలో ఒక చెంచా తేనె, 1/4 చెంచా పసుపు కలపండి. దీనిని పేస్ట్ లాగా తయారు చేయండి. ఈ పేస్‌ట్‌ను మొత్తం ముఖంపై అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. ఆ తర్వాత నీటితో కడగండి. ఈ ఫేస్ ప్యాక్ స్కిన్ ఇన్ఫెక్షన్‌ని తొలగించి, ముఖానికి మెరుపునిస్తుంది.

### 4. తేనె, ఓట్స్ ఫేస్ ప్యాక్:

ఓట్స్, తేనెతో చేసిన ఈ ఫేస్ ప్యాక్ చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. దీని కోసం ముందుగా ఓట్స్ ను గ్రైండ్ చేసి పౌడర్ చేసుకోవాలి. ఒక గిన్నెలో రెండు చెంచాల ఓట్స్ పౌడర్, కొద్దిగా పాలు, ఒక చెంచా తేనె కలపాలి. వీటిని మిక్స్ చేయాలి. ఈ ఫేస్ ప్యాక్‌ని ముఖానికి పట్టించి 1520 నిమిషాల తర్వాత కడిగేయాలి. దీన్ని తరుచుగా ముఖానికి అప్లై చేయడం వల్ల చర్మం మృదువుగా, మెరుస్తూ ఉంటుంది.

# క్రెడిట్ కార్డు వాడుతున్నారా? ఈ టిప్స్ పాటించండి




మీరు క్రెడిట్ కార్డు లేదా డెబిట్ కార్డు వాడుతున్నారా? అయితే ఈ కార్డుల పిన్ విషయంలో జర జాగ్రత్త.. కార్డు పిన్ కోడ్ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం పనికిరాదు. హ్యాకర్లు ఈ డెబిట్, క్రెడిట్ కార్డు పిన్‌లను ఇట్టే పసిగట్టేస్తారని తెలుసా? అందుకే, తరచుగా మీ క్రెడిట్, డెబిట్ కార్డ్ పిన్‌ని మార్చుకోవాలని చెప్పేది.. మీ పిన్‌ను దుర్వినియోగం చేస్తే విలువైన డబ్బును కోల్పోతారు. ప్రతి 3 నెలలకోసారి మీ అన్ని ముఖ్యమైన కార్డ్‌ల పిన్‌ను మారుస్తూ ఉండాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి నెలా మీరు అనేక షాపుల్లో మీ పిన్ కోడ్‌ను ఎంటర్ చేస్తుంటారు. అలాంటి పరిస్థితుల్లో మోసాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మీకు తెలియకుండానే మీ కార్డు పిన్ ద్వారా స్కామర్లు, హ్యాకర్లు డబ్బులను దొంగిలించే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మారుతున్న టెక్నాలజీతో పాటు డెబిట్, క్రెడిట్ కార్డుదారులు తప్పక అప్‌డేట్ కావాలి. కొత్త టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి. డెబిట్, క్రెడిట్ కార్డు పిన్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. స్ట్రాంగ్ సెక్యూరిటీ పిన్‌ను సెట్ చేసుకోవాలి. ఇలాంటి స్ట్రాంగ్ పిన్ కోడ్‌లను హ్యాకర్లు ఛేదించడం చాలా కష్టం కూడా. అందుకే మీ కార్డుల పిన్ కోడ్ తరచూ మారుస్తు ఉండాలి.

సెక్యూరిటీ పిన్ కోసం కొన్ని స్పెషల్ టిప్స్ :

* డెబిట్, క్రెడిట్ కార్డ్ పిన్‌ని క్రియేట్ చేస్తున్నప్పుడు.. సాధారణ సెక్యూరిటీ పిన్‌కి చాలా భిన్నంగా ఉండాలని గుర్తుంచుకోండి.
* మీ పిన్‌ను క్రియేట్ చేస్తున్నప్పుడు.. చాలా స్పష్టంగా కనిపించే సంఖ్యను సెట్ చేయవద్దు.
* చాలా మంది 0000 లేదా 1234ని పాస్‌వర్డ్‌గా పెట్టుకుంటారు. అటువంటి పిన్‌లు సులభంగా హ్యాక్ అవుతాయి.
* డెబిట్, క్రెడిట్ కార్డ్ పాస్‌వర్డ్ ఎంత యూనిక్‌గా స్ట్రాంగ్‌గా ఉంటే అంత మంచిది.
* మీ సెక్యూరిటీ పిన్ ఎంత ఎక్కువ ఉంటే.. హ్యాకర్లు క్రాక్ చేయడం అంత కష్టం.
* మీ పిన్‌ను 6 లేదా 8 అంకెల మధ్య ఉంచాలని సైబర్ నిపుణులు సిఫార్సు చేస్తున్నారు.

# ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు

- **పాక్ క్రికెటర్ మహమ్మద్ రిజ్వాన్ పిటిషన్‌ను కొట్టివేసిన లాహోర్ హైకోర్టు**
- **సైబర్ క్రైమ్ ఏజెన్సీ ఇచ్చిన నోటీసులను సవాల్ చేసిన వికెట్ కీపర్**
- **నోటీసులకు సమాధానం ఇవ్వాలని కోర్టు స్పష్టీకరణ**
- **విచారణకు సహకరించాలన్న న్యాయస్థానం**
- **రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌ల ఫోన్లపై కొనసాగుతున్న ఫోరెన్సిక్ పరీక్ష**
- **ఏజెన్సీ నివేదిక ఆధారంగా ఆటగాళ్లపై చర్యలు తీసుకోనున్న పీసీబీ**

పాకిస్థాన్ సీనియర్ క్రికెటర్లు మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌ల భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. 'నేషనల్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ' (ఎన్‌సీసీఐఏ) జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ వికెట్ కీపర్ బ్యాటర్ రిజ్వాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను లాహోర్ హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ ఇద్దరు ఆటగాళ్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే దిశగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ (పీసీబీ) అడుగులు వేసే అవకాశం కనిపిస్తోంది.

నేడు ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన లాహోర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలియా నీలమ్, ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత దానిని కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. విచారణ సందర్భంగా రిజ్వాన్ తరఫు న్యాయవాది ఖాజీ ఉమైర్ అలీ వాదనలు వినిపిస్తూ, తన క్లయింట్‌కు ఎన్‌సీసీఐఏ నోటీసులు జారీ చేసిందని తెలిపారు. దీనిపై స్పందించిన చీఫ్ జస్టిస్, "మీరు వెళ్లి నోటీసులకు సమాధానం ఇవ్వాలి. మీకు నోటీసు ఎప్పుడు జారీ అయింది?" అని ప్రశ్నించారు.

లార్డ్స్ టెస్ట్ తర్వాత తన క్లయింట్‌ను హోటల్ లాబీకి పిలిచి, ఎలాంటి నోటీసు లేకుండా విచారించారని, అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారని న్యాయవాది కోర్టుకు వివరించారు. మూడు గంటల్లో ఫోన్ తిరిగి ఇస్తామని చెప్పి తీసుకున్నారని, కానీ ఇప్పటికీ ఇవ్వలేదని, ఇది దురుద్దేశాన్ని సూచిస్తోందని వాదించారు.

క్రికెటర్లను అవినీతి నుంచి కాపాడేందుకు ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ సరైన వేదిక అని, ఈ కేసును ఆ విభాగానికి ఎందుకు అప్పగించలేదని ఆయన ప్రశ్నించారు. ఎన్‌సీసీఐఏ అధికార పరిధిని, దర్యాప్తు తీరును ఆయన సవాల్ చేశారు.

ప్రస్తుత పరిణామాలను గమనిస్తున్న విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఎన్‌సీసీఐఏ అధికారులు రిజ్వాన్, ఇమామ్‌ల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లకు ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వచ్చే వారంలోగా ఈ పరీక్షల నివేదికను పీసీబీకి సమర్పించనున్నారు.

ఈ నివేదికలో వెల్లడయ్యే అంశాల ఆధారంగానే పీసీబీ తదుపరి చర్యలు తీసుకోనుంది. ఫోరెన్సిక్ పరీక్షల్లో అసాధారణంగా ఏమీ లభించకపోతే, ఆటగాళ్లకు ఉపశమనం లభించే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి ఎన్‌సీసీఐఏ నివేదికపైనే కేంద్రీకృతమైంది.



## అగార్కర్‌కు గుడ్‌బై? కొత్త చీఫ్ సెలెక్టర్ రేసులో ఇద్దరు మాజీ క్రికెటర్లు!

- **ఈ నెలతో ముగియనున్న అగార్కర్ పదవీకాలం**
- **ఆయనకు పొడిగింపు దక్కకపోవచ్చని సమాచారం**
- **పరిశీలనలో పార్థివ్, ప్రజ్ఞాన్ పేర్లు**
- **బుధవారం సమావేశమే అగార్కర్‌కు చివరిది కావచ్చని సమాచారం**

భారత సీనియర్ పురుషుల క్రికెట్ జట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం ఈ నెలతో ముగియనున్నట్లు తెలుస్తోంది. ఆయనకు పొడిగింపు ఇవ్వకపోవచ్చని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. అగార్కర్ స్థానంలో మాజీ క్రికెటర్లు పార్థివ్ పటేల్, ప్రజ్ఞాన్ ఓజా పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

అగార్కర్ పదవీకాలాన్ని వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉందన్న వార్తలు గతంలో వచ్చాయి. అయితే బీసీసీఐలోని ఓ వర్గం మాత్రం ఆయనకు పొడిగింపు దాదాపు ఉండదనే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. శుక్రవారం బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో అగార్కర్‌కు పొడిగింపు దక్కే అవకాశం తక్కువగా ఉందని సమాచారం.

బుధవారం జరిగిన సెలెక్షన్ సమావేశమే అగార్కర్ ఛైర్మన్‌గా చివరి సమావేశం కావచ్చని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఆ సమావేశంలోనే వెస్టిండీస్‌తో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌లకు భారత జట్లను ఎంపిక చేశారు. రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టును కూడా అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీనే ఎంపిక చేసింది.

అగార్కర్ స్థానంలో పార్థివ్ పటేల్, ప్రజ్ఞాన్ ఓజా పేర్లు ముందంజలో ఉన్నట్లు సమాచారం. ఇద్దరూ ఐపీఎల్‌లో మూడు సార్లు విజేతలుగా నిలిచిన జట్లలో సభ్యులుగా ఉన్నారు. పార్థివ్ వికెట్ కీపర్ బ్యాటర్ కాగా.. ఓజా మాజీ స్పిన్నర్. అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు రోహిత్ శర్మను ఎంపిక చేసింది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో రోహిత్ లేడని గతంలో సెలెక్టర్లు చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఇంగ్లాండ్‌తో వరుసగా రెండు వన్డేల్లో తక్కువ స్కోర్లు చేయడంతో రోహిత్‌పై ఒత్తిడి పెరిగింది. అయితే చివరి వన్డేలో 138 పరుగుల అద్భుత ఇన్నింగ్స్‌తో అతడు గట్టి సమాధానం ఇచ్చాడు.



# 14 గంటల వెయిటింగ్.. గదులు లేవు, తిండి లేదు.. ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల కష్టాలు!

- **నాగోయాలో భారత అథ్లెట్లకు వసతి కష్టాలు**
- **కొందరికి ఆహారం కూడా అందుబాటులో లేక ఇబ్బందులు**
- **గదులు వచ్చిన వారిని ఇతరులతో సర్దుకోవాలని సూచన**
- **రోయర్లు, షూటర్లు సహా పలు బృందాలకు సమస్య**
- **ఇతర హోటళ్లకు కొందరు భారత సభ్యుల తరలింపు**
- **అథ్లెట్ల సంఖ్య అంచనాలో పొరపాటే కారణమని నివేదిక**




ఆసియా క్రీడల కోసం జపాన్‌లోని నాగోయాకు చేరుకున్న భారత అథ్లెట్లకు చేదు అనుభవం ఎదురైంది. అక్రిడిటేషన్లు ఉన్నప్పటికీ పలువురు క్రీడాకారులకు సకాలంలో వసతి గదులు కేటాయించలేదు. దీంతో 12 గంటలకు పైగా, కొందరు 14 గంటల వరకు గదుల కోసం వేచి చూడాల్సి వచ్చింది. ఈ సమయంలో ఆహారం కూడా అందుబాటులో లేకపోవడంతో అథ్లెట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది.

భారత రోయింగ్ బృందానికి చెందిన క్రీడాకారులు మంగళవారం ఢిల్లీ నుంచి రెండు బృందాలుగా జపాన్‌కు బయల్దేరారు. బ్యాంకాక్‌లో విరామం తర్వాత తొలి బృందం బుధవారం ఉదయం 8 గంటల సమయంలో నాగోయా చేరుకుంది. అక్కడి నుంచి గంట తర్వాత వసతి కోసం ఏర్పాటు చేసిన క్రూజ్ నౌక వద్దకు వెళ్లారు. అయితే గదులు సిద్ధంగా లేకపోవడంతో అక్కడే నిరీక్షించాల్సి వచ్చింది.

ఓ రోయర్ 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్'తో మాట్లాడుతూ.. ఉదయం 9 గంటలకు వసతి కేంద్రానికి చేరుకున్నామని, రాత్రి 8.30 గంటల సమయానికి కొద్దిమందికే గదులు లభించాయని తెలిపారు. గదులు పొందిన వారిని కూడా మరికొందరు క్రీడాకారులతో కలిసి ఉండాలని కోరినట్లు చెప్పారు.

రోయర్లే కాకుండా భారత షూటర్లు, మరో రెండు జట్లకు కూడా ఇదే పరిస్థితి ఎదురైనట్లు నివేదిక పేర్కొంది. షూటర్లకు కేటాయించిన వసతి కేంద్రాన్ని ఇతర దేశాల బృందాలకు ఇవ్వడంతో వారు మరో హోటల్‌లో బస చేయాల్సి వచ్చింది. భారత ఒలింపిక్ సంఘానికి చెందిన కొందరు సభ్యులను కూడా సమీపంలోని మరో హోటల్‌కు తరలించారు. వైద్య బృందం కూడా తాత్కాలికంగా వారితో కలిసి సర్దుకోవాల్సి వచ్చింది.

క్రీడాకారులు, బృందాల సంఖ్యను నిర్వాహకులు సరిగా అంచనా వేయకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తినట్లు నివేదిక పేర్కొంది. అందుబాటులో ఉన్న వసతిలో కొంత భాగాన్ని ఇతర దేశాల బృందాలకు కేటాయించడంతో భారత అథ్లెట్లకు గదుల కొరత ఏర్పడినట్లు తెలిపింది. ఆసియా క్రీడల ఆరంభానికి ముందే వసతి ఏర్పాట్లలో తలెత్తిన ఈ గందరగోళం భారత బృందాలకు ఇబ్బందికరంగా మారింది.

# హర్మన్‌ప్రీతే బెస్ట్ కెప్టెన్.. కెప్టెన్సీ మార్పుపై అంజుమ్ కీలక వ్యాఖ్యలు

- **భారత మహిళా జట్టు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కొనసాగాలన్న అంజుమ్ చోప్రా**
- **ప్రస్తుతానికి జట్టును నడిపించగల ఉత్తమ వ్యక్తి హర్మన్‌ప్రీతేనని స్పష్టీకరణ**
- **ఆసియా కప్‌లో ఫామ్‌లో లేకపోయినా తిరిగి పుంజుకుంటుందని ధీమా**
- **కెప్టెన్‌గా, బ్యాటర్‌గా ఆమె సేవలు జట్టుకు అవసరమన్న అంజుమ్**




భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్సీ మార్పుపై చర్చ జరుగుతున్న తరుణంలో, మాజీ కెప్టెన్ అంజుమ్ చోప్రా ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌కు గట్టి మద్దతు తెలిపింది. ఇటీవలి కాలంలో బ్యాటింగ్‌లో రాణించకపోయినా, జట్టును నడిపించడానికి ఆమెనే సరైన వ్యక్తి అని స్పష్టం చేసింది.

ఇటీవల దుబాయ్‌లో జరిగిన టీ20 ఆసియా కప్‌ను భారత్ రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి గెలుచుకుంది. అయితే, ఈ టోర్నీలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ 5 మ్యాచ్‌ల్లో కేవలం 71 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచింది. దీనికి తోడు ఆమె వయసు 37 ఏళ్లు కావడంతో, వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు కెప్టెన్సీ అప్పగించాలనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో మాట్లాడిన అంజుమ్ చోప్రా, కెప్టెన్సీ మార్పుపై వస్తున్న చర్చలను తోసిపుచ్చింది. "ప్రస్తుతానికి భారత జట్టును నడిపించడానికి హర్మన్‌ప్రీతే ఉత్తమ కెప్టెన్. ఆమె బ్యాటింగ్ ప్రదర్శనపై విమర్శలు వస్తున్నాయి. కానీ, ప్రతిసారీ ఆమె నుంచి 2017 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఆడిన 171 పరుగుల వంటి ఇన్నింగ్స్‌ను ఆశించలేం" అని పేర్కొంది.

రాబోయే ఆసియన్ గేమ్స్, ఇతర సిరీస్‌లతో హర్మన్‌ప్రీత్ తిరిగి ఫామ్‌లోకి వస్తుందని అంజుమ్ చోప్రా ధీమా వ్యక్తం చేసింది. "ముఖ్యమైన టోర్నమెంట్ల నాటికి బ్యాట్‌తో రాణించడం ఎంత ముఖ్యమో ఆమెకు తెలుసు. కెప్టెన్‌గా, బ్యాటర్‌గా ఆమె సేవలు భారత జట్టుకు ఇంకా ఎంతో అవసరం" అని వివరించింది. 2027లో జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకుని చూసినా, హర్మన్ నాయకత్వమే సరైనదని ఆమె అభిప్రాయపడింది.

# పంత్, పాండ్యాను ఎందుకు పక్కన పెట్టారు?

- **మేనేజ్‌మెంట్ ఫీడ్‌బ్యాక్ వల్లే పంత్‌ను పక్కన పెట్టినట్లు సమాచారం**
- **పాండ్యాకు 10 ఓవర్ల బౌలింగ్ పరీక్షించాలని నిర్ణయం**
- **పాండ్యాకు ప్రత్యామ్నాయంగా నితీశ్‌ను భావిస్తున్న మేనేజ్‌మెంట్**
- **నామన్ ధీర్, అకీబ్ నబీకి తొలిసారి చోటు**
- **సెప్టెంబరు 27 నుంచి వెస్టిండీస్‌లో వన్డే సిరీస్ ప్రారంభం**




వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు రిషబ్ పంత్ దూరమయ్యాడు. అతడిని ఎంపిక చేయకపోవడానికి జట్టు మేనేజ్‌మెంట్ నుంచి వచ్చిన కీలక ఫీడ్‌బ్యాక్ కారణమని పీటీఐ నివేదిక తెలిపింది. పంత్ తనకున్న అపార ప్రతిభకు తగ్గట్లు వైట్‌బాల్ క్రికెట్‌లో రాణించడం లేదని జట్టు మేనేజ్‌మెంట్‌లోని కీలక సభ్యులు అభిప్రాయపడినట్లు సమాచారం.

పంత్ ప్రస్తుతం ఇరానీ కప్ కోసం ఎంపికైన రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ముంబయి బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు.

హార్దిక్ పాండ్యా కూడా వెస్టిండీస్ వన్డేలకు ఎంపిక కాలేదు. సెప్టెంబరు 20న ఫిట్‌గా ఉన్నట్లు తేలినా.. భారత్‌ఏ తరఫున 10 ఓవర్ల పూర్తి కోటా బౌలింగ్ చేసిన తర్వాతే పాండ్యాను జట్టులోకి తీసుకోవాలని సెలెక్టర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆరు ఓవర్లు బౌలింగ్ చేయడం సరిపోదని వారు స్పష్టం చేసినట్లు సమాచారం.

పాండ్యా అందుబాటులో లేకపోవడంతో సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అవసరం పెరిగింది. దీంతో ఆసియా క్రీడల జట్టు నుంచి నితీశ్ కుమార్ రెడ్డిని తప్పించి వన్డే జట్టులోకి తీసుకున్నారు. పాండ్యా ఫిట్‌నెస్ సమస్యల నేపథ్యంలో నితీశ్‌ను భవిష్యత్ ప్రత్యామ్నాయంగా చూస్తున్నట్లు తెలుస్తోంది.

ఇక పంజాబ్ ఆల్‌రౌండర్ నామన్ ధీర్, జమ్మూకశ్మీర్ పేసర్ అకీబ్ నబీ తొలిసారి భారత వన్డే జట్టులో చోటు దక్కించుకున్నారు. శ్రేయస్ అయ్యర్ అందుబాటులో లేకపోవడంతో కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. వెస్టిండీస్‌తో భారత్ మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. సెప్టెంబరు 27న తిరువనంతపురంలో తొలి వన్డే జరగనుంది.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S